జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 38 విశాఖపట్నం శనివారం 23 అక్టోబరు 2021 8 పేజీలు వెల : 5.00

## ఉవ్వెత్తున జనాగ్రహ దీక్షలు




అమరావతి,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: టీడీపీ బూతు వ్యాఖ్యలకు నిరసనగా ఏపీ వ్యాప్తంగా జనాగ్రహ దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు కూడా ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నేత పట్టాభి చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనాగ్రహ దీక్షలు కొనసాగుతున్నాయి. శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు నల్లదుస్తులు ధరించిన ఎమ్మెల్యే పద్మావతి, కార్యకర్తలు చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## 61 అంతస్థుల భవనంలో అగ్ని ప్రమాదం



ముంబై,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: నగరంలోని కర్రీ రోడ్‌లో ఉన్న 61 అంతస్థుల నివాస భవనంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. అవిఘ్న పార్క్ బిల్డింగ్‌లోని 19వ అంతస్థులో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక దళాలు ప్రమాద స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు ప్రారంభించాయి. ఈ భవనంలోని ప్రజలను కాపాడేందుకు, మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్నాయి. సెంట్రల్ ముంబై అగ్నిమాపక శాఖ అధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, అవిఘ్న పార్క్ బిల్డింగ్‌లోని 19వ అంతస్థులో శుక్రవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. ఈ మంటలను ఆర్పేందుకు 12 అగ్నిమాపక శకటాలు కృషి చేస్తున్నాయి. వాటర్ ట్యాంకర్లను కూడా తరలించారు. మరిన్ని వివరాలు తెలియవలసి ఉంది.

## లాసెట్ ఫలితాలు విడుదల




అమరావతి,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో 3, 5 ఏళ్ల ఎల్ఎల్ బీ, 2 ఏళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశానికి గత నెల 22న నిర్వహించిన ఏపీ లాసెట్ 2021 ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి తిరుపతిలో గురువారం విడుదల చేశారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏపీ లాసెట్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మూడు కోర్సుల్లోనూ మహిళలే మొదటి ర్యాంకులు సాధిం చారని తెలిపారు. వర్సిటీ వీసీ డి.జమున, లాసెట్ కన్వీనర్ చంద్రకళ, (మిగతా 2లో..)

### 'అందరితో కలిసి...'

# లక్ష్య సిద్ధికి ఇదే నిదర్శనం



న్యూఢిల్లీ,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్-19 వ్యాక్సినేషన్‌ను భారీ స్థాయిలో విజయవంతం చేసిన దేశ ప్రజలందరికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం దేశంలోని ప్రతి వ్యక్తికీ సంబంధించినదని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నానని తెలిపారు. అక్టోబరు 21 ఉదయం 10 గంటలకు దేశవ్యాప్తంగా 100 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేయడం పూర్తయిన సంగతి తెలిసిందే. వ్యాక్సినేషన్ భారీ విజయం సాధించిన సందర్భంగా మోదీ శుక్రవారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. "అక్టోబరు 21న భారత దేశం 100 కోట్ల వ్యాక్సిన్ డోసుల పంపిణీ లక్ష్యాన్ని సాధించింది. ఈ విజయం దేశంలోని ప్రతి వ్యక్తికి సంబంధించినది. ఈ మహోన్నత కృత్యానికి ప్రతి పౌరుడిని అభినందిస్తున్నాను" అని తెలిపారు. 100 కోట్ల వ్యాక్సిన్ డోసుల పంపిణీ అనేది కేవలం ఓ గణాంకం కాదన్నారు. భారత దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి ఇది నాంది అని చెప్పారు. భారత దేశం ఓ కఠిన లక్ష్యాన్ని విజయవంతంగా సాధించగలదని చెప్పడానికి ఓ సజీవ సాక్ష్యమని తెలిపారు. భారత దేశం తన లక్ష్యాల సాధనకు కఠోరంగా (మిగతా 2లో..)

### నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ...

# పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి

### క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వాతావరణానికి, ప్రజలకు హానికరమైన వ్యర్థాల తొలగింపులో అత్యుత్తమ విధానాలు పాటించాలని అధికారులకు సూచించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. క్లాప్ కార్యక్రమం కింద ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొత్తగా వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. గ్రేడ్- 2,3, నగర పంచాయతీలకు క్లాప్ కింద నిర్దేశించిన వాహనాలన్నింటినీ కూడా ఆయా నగరాలకు, పట్టణాలకు, నగర పంచాయతీలకు, పంచాయతీలకు చేరవేయాలన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను వీలైనంత తర్వగా తెప్పించుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత కంపెనీలతో మాట్లాడుకుని ఆయా వాహనాలను సత్వరమే తెప్పించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నుంచి సమీప ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు గార్బేజ్‌ను తొలగించడమే కాకుండా దుర్వాసన ఆ ప్రాంతంలో రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుంటూరు వ్యర్థాలనుంచి విద్యుత్ ఉత్పత్తి (మిగతా 2లో..)

## నవంబర్ 1 నుంచి అమరావతి రైతుల మహా పాదయాత్ర



అమరావతి,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని పరిరక్షించాలని కోరుతూ నవంబర్ 1వ తేదీ నుంచి రైతులు మహా పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మహా పాదయాత్రకు పలువురి మద్దతును రైతులు కోరుతున్నారు. మహా పాదయాత్రకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ మద్దతును రాజధాని రైతుల ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఉదయం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్‌ను రైతులు కలిసారు. ఈ మహా పాదయాత్ర తుళ్ళూరు గ్రామం నుంచి తిరుమల వరకు 45 రోజులపాటు సాగనుంది. డిసెంబర్ 17వ తేదీతో పాదయాత్ర ముగియనుంది. దాదాపు రెండేళ్లుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అమరావతి పరిరక్షణలో భాగంగా మహా పాదయాత్ర తలపెట్టినట్లు రైతులు చెప్పారు. రాజధాని కోసం మద్దతు తెలిపిన పవన్ కళ్యాణ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్, మనోహర్‌లు మహా పాదయాత్రకు మద్దతు ఇవ్వాలని రైతులు, జేఏసీ నేతలలు విజ్ఞప్తి చేసారు. రైతుల మహా పాదయాత్ర విజయవంతం కావాలని మనోహర్ ఆకాంక్షించారు.




## మోదీ చెప్పున్నదంతా అరకొర సమాచారం : కాంగ్రెస్

న్యూఢిల్లీ,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్ వ్యాక్సిన్ 100 కోట్ల డోసుల పంపిణీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అరకొర సమాచారాన్ని ప్రజల ముందు ఉంచుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. దేశంలోని శాస్త్రవేత్తలు, పరిశోధకులు చేసిన కృషిని తక్కువ చేసి చూపుతున్నారని విమర్శించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం జాతిని ఉద్దేశించి (మిగతా 2లో..)

# హైస్కూళ్ల పరిధిలోకి 3, 4, 5 తరగతులు

- ఒకే ఆవరణ లేదా 250 మీటర్లలోపు ఉన్న ప్రైమరీ స్కూళ్లకు మాత్రమే వర్తింపు
- ఆ మేరకు ప్రైమరీ టీచర్ల సర్దుబాటు
- మార్గదర్శకాలు జారీ




అమరావతి,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ప్రైమరీ స్కూళ్లలోని 3, 4, 5 తరగతులను హైస్కూళ్ల పరిధిలోకి తేవాలని నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ గురువారం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ తరగతుల విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు వీలుగా వారికి ఉన్నత బోధనను అందించేందుకు ఈ చర్యలు చేపట్టింది. ఒకే ఆవరణలో ఉన్న లేదా 250 మీటర్ల లోపు దూరంలో ఉన్న ప్రైమరీ స్కూళ్ల 3, 4, 5 తరగతులను (మిగతా 2లో..)

# మా బలం చైనాకు తెలుసు: అమెరికా హెచ్చరిక



వాషింగ్టన్,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: తమ బలమేంటో చైనా, రష్యా సహా ప్రపంచం మొత్తానికి తెలుసని, తైవాన్‌పై చైనా దాడికి దిగితే తాము తైవాన్‌ను రక్షిస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశారు. తమ బలం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రపంచంలోనే తాము అత్యంత శక్తివంతమైన మిలిటరీ దేశమని ఆయన పేర్కొన్నారు. చైనా-తైవాన్ ఉద్రిక్తల నేపథ్యంలో తాజాగా ఓ ప్రకటనలో బైడెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తైవాన్ విషయంలో చైనా కొన్నాళ్లుగా అతివాద ధోరణి ప్రదర్శిస్తోంది. తైవాన్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా కొద్ది రోజుల క్రితం తైవాన్ గగనతలంలోకి 52 యుద్ధవిమానాలను చైనా పంపింది. కొద్ది రోజులుగా చైనా ఇదే తరహాలో కవ్వింపు చర్యలకు దిగుతోంది.కాగా, తైవాన్‌తో అమెరికాకు ఉన్న ఒప్పందాల్లో ఎలాంటి మార్పు లేదని, ఆ పాలసీలనే ఇకపై కూడా కొనసాగిస్తామని బైడెన్ స్పష్టం చేశారు. తైవాన్‌ను చైనా నుంచి కాపాడతామని చైనాకు పరోక్షంగా హెచ్చరిక చేశారు. అయితే తైవాన్-చైనాలను ఏకం చేసి తీరుతామని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కాగా, చైనాకు తైవాన్ కూడా గట్టిగానే బదులిస్తోంది. చైనా ఒత్తిళ్లకు, బెదిరింపులకు తలొగ్గేది లేదని స్పష్టం చేసింది. తాజాగా అమెరికా బహిరంగ మద్దతు రావడంతో తైవాన్‌కు మరింత ఆర్థిక స్థైర్యం వచ్చి ఉంటుందని, డ్రాగన్ కాస్త వెనకడుగు వేయొచ్చని అంటున్నారు.

bahujan bazaar బహుజన్ బజార్ bahujan bazaar
www.bahujanbazaar.in




మిత్రులందరికీ జై భీం,

మన పోరాట యోధురాలు ఝల్‌కరీ భాయీ చరిత్రను వక్రీకరించి ఝాన్సీలక్ష్మీ భాయి చరిత్రను మన చేత ప్రచారం చేయించిన విషయం మీకు తెలుసు దీనికి కారణం మన రచయితలను మనం ప్రోత్సహించకపోవడం. అదేవిధంగా మన రచనలు ప్రతి ఊరులో అందుబాటులో లేకపోవడం వల్ల మన బహుజన వాదం వెనుకబడుతున్న విషయం కూడా మన అందరికి తెలుసు

అందువల్ల బహుజన రచనలను అన్నింటిని మీరు అర్డరు చేసిన వెంటనే మీకు అందించే విధంగా చేద్దాం. బహుజన రచయితలను ఆర్థికంగా బలోపేతం చేయడం వల్ల మన చరిత్రలను వెలికితీసే విధంగా చేద్దాం. పుస్తకాలను కొనండి, చదవండి, హాస్టల్ పిల్లలకు బహుమానం ఇవ్వండి.

లాభాలు

- అన్ని ప్రాంతాలు తిరుగకుండా ఇంటినుండే కోరుకున్న పుస్తకాన్ని ఇంటివద్దకు తెప్పించుకోవడం సులువవుతుంది. తద్వారా సమయం డబ్బు ఆదా అవుతుంది.
- మనవాళ్ళ బహుజన చరిత్ర తెలుసుకోవడం బహుజనాభివృద్ధికి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలల్లో తగిన విధంగా అవగాహనకు అవకాశం ఉంటుంది.
- బహుజనులకు సంబంధించిన రచయితలు ఎవరెవరు ఎక్కడ ఉన్నారు ఏమేమి రచయినలు చేసారో సులభంగా ఒకేచోట తెలుస్తుంది.
- బహుజన రచయితలు ఆర్థికంగా బలపడటం వల్ల పరిశోధనాత్మకత అభివృద్ధి (Research and Development) సాధ్యం అవుతుంది.

ఉచితం : రూ. 1000/- తో సభ్యత్వం తీసుకున్నవారికి సంవత్సర కాలములో పుస్తకాల రవాణా ఖర్చులు ఉచితం.
రూ. 500/-లకు పైన కొనగోలు చేసే పుస్తకాలపై కూడా రవాణా ఖర్చులు ఉచితం.

ప్రతి యొక్క బహుజనుడు కనీసం ఒక పుస్తకాన్ని కొని హస్టల్ పిల్లలకు ఉచితంగా ఇచ్చి బహుజనాభివృద్ధి తోడ్పడండి.

జై భీం, జై ఫూలే, జై బహుజన

డాక్టర్ కె. శివ భాగ్యారావు బహుజన IRS-VRS
చైర్మన్, స్నేహ గ్రూప్స్

# ఎస్ ఆర్ శంకరన్ సేవలు మరువలేనివి

## సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి

విశాఖపట్నం, అక్టోబర్ 22 (ప్రజాపాలన బ్యూరో ): అణగారిన వర్గాల హక్కుల కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి శంకరన్ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి అన్నారు. మాజీ ఐ ఎ ఎస్ అధికారి, త్రిపుర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జె వి సత్యనారాయణ మూర్తి ముఖ్య



అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జె వి ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ ఎస్ ఆర్ శంకరన్ సామాన్య కుటుంబంలో జన్మించి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా ఎస్టీ ఎస్సి సబ్ ప్లాన్ నిధులను తీసుకురావడంలో ఆయన ప్రధాన భూమిక పోషించారని అన్నారు. ఆ నిధులను సక్రమంగా అమలు చేయడంలో కూడా ఆయన కృషి చేశారన్నారు. రాజ్యాంగ బద్దంగా సంక్రమించిన హక్కుల పరిరక్షణకు శంకరన్ చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు.సీపీఐ గ్రేటర్ విశాఖ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎ విమల, నగర నాయకులు ఎం డి బేగం, జి జయ, ఎ దేముడమ్మ, జి కాసులరెడ్డి, కె లక్ష్మణరావు, ఎన్ అప్పన్న, ఎన్ నాగభూషణం, జె అన్వేషి, ఎ రవి, ఎ ఆదినారాయణ, కె వి సుబ్బరాజు కె తిరుపతిరావు, సి డి ఆర్ రమణ, ఎం శ్రీనివాసరావు, బి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# హైస్కూళ్ల పరిధిలోకి 3, 4, 5 తరగతులు

(మొదటి పేజీ తరువాయి)

హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలోకి తీసుకురావాలని ఆదేశించింది. అలాగే 1, 2 తరగతుల విద్యార్థులకు ప్రైమరీ ఎస్జీటీలతో బోధన కొనసాగించి, ఇతర సీనియర్ ఎస్జీటీలను 3, 4, 5 తరగతుల బోధనకు వీలుగా సర్దుబాటు చేయనుంది. ప్రాథమిక తరగతుల్లో టీచర్, విద్యార్థులను 1:20 నిష్పత్తిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

## 'అందరితో కలిసి...'

# లక్ష్య సిద్ధికి ఇదే నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

శ్రమించగలదని ఇది రుజువు చేస్తోందని తెలిపారు. మన దేశం కోవిడ్ ఉద్యమంలో విజయం సాధించడానికి కారణం దీని వెనుక 130 కోట్ల మంది ప్రజలు ఉండటమేనన్నారు. ఇది వారి విజయమేనని, వారందరినీ తాను అభినందిస్తున్నానని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు మనల్ని ప్రశంసిస్తున్నాయన్నారు. అయితే మనం ఎక్కడ ప్రారంభించామనేది చాలా మంది మర్చిపోయారన్నారు. అప్పట్లో మనం ఇతరులపై ఆధారపడేవారమన్నారు. మన వ్యాక్సినేషన్ ప్రోగ్రామ్‌పై అపోహలు ఉండేవన్నారు. భారత దేశంలో క్రమశిక్షణ ఎలా అమలవుతుందో? అంటూ మాట్లాడుకునేవారన్నారు. భారత దేశ వ్యాక్సినేషన్ కార్యక్రమం "అందరితో కలిసి, అందరి అభివృద్ధి, అందరి నమ్మకం, అందరి కృషి" అనేదానికి సజీవ ఉదాహరణ అని తెలిపారు. వీఐపీ సంస్కృతి వల్ల సామాన్యులకు వ్యాక్సిన్ అందని పరిస్థితి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# వైసిపి నిరసన కార్యక్రమాలు



ఏలూరు అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: దెందులూరు శాసనసభ్యులు కొఠారి అబ్బయ్య చౌదరి అదునుసారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై టిడిపి నాయకుడు పట్టాభి చేసిన అనుచిత వ్యాఖ్యలకు పెదపాడు గ్రామంలో స్థానిక నాయకులు అప్పన ప్రసాద్ ఎంపిపి బత్తుల రత్నకుమారి , ఆళ్ళ సతీష్ , అక్కినేని రాజశేఖర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా పెదపాడు సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గారి విగ్రహం వద్దకు చేరుకుని నివాళులు అర్పించి, చంద్రబాబు, వారి తనయుడు లోకేష్ కు బుద్ధి ప్రసాదించాలంటు నివేదికను అంబేద్కర్ కు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇప్పటికైనా చంద్రబాబు తన తీరును మార్చుకోవాలని లేకపోతే రాబోయే రోజుల్లో ఈనిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గారపాటి భాస్కరరావు గారు, కంభంపాటి సుబ్రహ్మణ్యం గారు, నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి ఆధ్వర్యంలో రెండవరోజు జనాగ్రహ నిరహార దీక్ష



ఏలూరు అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: ఏలూరు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై టిడిపి నేతలు అసభ్య పదజాలంతో దూషణలకు పాల్పడటాన్ని నిరసిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ లో వైయస్సార్సీపి ఆధ్వర్యంలో రెండవరోజు జనాగ్రహ నిరహార దీక్షల్లో ఏలూరు నగరమేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏలూరు అర్బన్ డెవలఫ్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మద్యహ్నపు ఈశ్వరీ బలరామ్, ఏలూరు స్మార్టు సిటీ చైర్మన్ బొద్దాని అఖిల ప్రియ, ఏ.ఎమ్.సి చైర్మన్ మంచెం మైబాబు, వైసిపి లీగల్ సెల్ జిల్లా అద్యక్షుడు డి.వి.రామాంజనేయులు, బి.జగన్నాదరెడ్డి, చదలవాడ వెంకటరమణ, తిప్పాని రమ్మోహనరావులు , వాణిజ్య విభాగం నాయకులు ఎమ్.సదానంద కుమార్ తదితర వైసిపి నాయకులు పాల్గొని టిడిపి చంద్రబాబు, అతని అనుచర నేతలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు దూషణలు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దొంగ దీక్షను విరమించి వెంటనే బహిరంగ క్షమాపణతెలపాలని ముక్త కంఠంతో డిమాండ్ చేశారు.

## మందకృష్ణ మాదిగ ను కలిసిన మాదిగ జర్నలిస్టులు



విజయవాడ అక్టోబర్ 22 ప్రజా పాలన ప్రతినిధి: ఇటీవల ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ కాలికి గాయమై శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కొంతకాలం హైదరాబాద్లోనూ ప్రస్తుతం విజయవాడలో విశ్రాంతి తీసుకుంటున్న కృ ష్ణను మాదిగ జర్నలిస్టులు పలువురు ఆయన కలిసి పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కృష్ణ మాదిగ దృష్టికి తీసుకువెళ్లారు వీటిలో ముఖ్యంగా కుల వివక్షత ని వేశన స్థలాలు ఇలాంటి విషయాలపై పలువురు ప్రతి నిధులు ఆయనతో చర్చించారు ఈ విషయమై మంద కృష్ణ మాదిగ స్పందిస్తూ ఈ సమస్య స్థానిక కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారుఇలా వెళ్ళిన వారిలో ప్రజా పాలన బ్యూరో చీఫ్ అందుగుల రత్నరా జు, సూర్య బ్రాంచ్ మేనేజర్ కన్నెగంటి సజ్జన్ రావు మాదుగుల కి రణ్ మురళి తదితరులు పాల్గొన్నారు

# జగనన్న స్వచ్ఛ సంకల్పం విజయవంతం చేయాలి




రాజుపాలెం, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: అంచుల వారి పాలెం గ్రామం లో జరిగిన సర్వసభ్య సాధారణ సమావేశం లో " జగనన్న స్వచ్ఛ సంకల్పం"లో పాల్గొని ప్రసంగిస్తున్న సర్పంచ్ లిఅంచుల రామాంజనేయులులి గారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు స్వచ్ఛమైన మనసుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం నీ రాష్ట్రంలోని అన్ని గ్రామాల ప్రజలు విజయవంతం చేయాలని అదే విధముగా గా ప్రతి గ్రామంలో తడి చెత్త ,పొడి చెత్త లను వేరువేరుగా చేసి గ్రామంలో ఉన్నటువంటి గ్రీన్ అంబాసిడర్ లకు ఇచ్చి తద్వారా గ్రీన్ అంచుల వారి పాలెం గా తీర్చిదిద్దాలని అలా తీర్చిదిద్దాలంటే మీ అందరి సహాయ సహకారాలు కావాలని అని అన్నారు. మనం పరిశుభ్రంగా వుంటూ మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచితే గ్రామంలోకి ఎటువంటి అనారోగ్యాలు దరిచేరవు అని ఈ సందర్భంగా తెలియజేశారు. అదే విధముగా మన ప్రియతమ ఎమ్మెల్యే శ్రీ అంబటి రాంబాబు గారి మానసపుత్రికలు అయినా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ ల ద్వారా తడి చెత్త లను ,పొడి చెత్త లను వేరువేరుగా చేసి వానపాముల ఎరువులు తయారు చేసి తద్వారా దానిని రైతులకు అమ్మడం ద్వారా కొంత ఆదాయాన్ని గ్రామ పంచాయతీలకు ఆర్జించేల చర్యలు తీసుకొని ఆదాయ వనరులు ఏర్పాటు చేయాలని పంచాయతీ సెక్రటరీ ని కోరారు. అంతే కాకుండా గ్రామంలో ప్రతి ఇంటి నుండి రోజుకు రెండు రూపాయలు వసూలు చేసి వచ్చే ఆదాయాన్ని గ్రీన్ అంబాసిడర్ లకు గౌరవ వేతనం రూపంలో చెల్లించాలని తీర్మానం చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో రాజుపాలెం మండలం లివైస్ %వీూ% హరి సూరమ్మ నాగేశ్వర రావు గారులి ,విద్యా కమిటీ చైర్మన్ తోట శ్రీకాంత్ గారు, వైస్ ప్రెసిడెంట్ గలభా ధనలక్ష్మి గారు ,సెక్రెటరీ ముక్త్యార్ గారు, వార్డు మెంబర్లు డబ్బారి అయ్యేరయ్యా, అంచుల విజయ్ బాబు, కడియం వెంకట నరసమ్మ, బసివల లక్ష్మి, కడియం వీర్ల అంకమ్మ, అంచుల మణి, వాలంటీర్స్ మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ఓటుకు నోటు కేసులో హైదరాబాదు నుండి పారిపోయి వచ్చాడు: ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: ఓటుకు నోటు కేసులో హైదరాబాదు నుండి రాత్రికి రాత్రే విజయవాడకు పారిపోయి తలదాచుకున్న నాయకుడు చంద్రబాబు అని నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.లినరసరావుపేట లో రెండో రోజు జనాగ్రహ సభలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైఎస్ఆర్ సీపీ నాయకులు డాక్టర్లు కార్యకర్తలు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఓటుకు నోటు కేసులో హైదరాబాద్ నుండి విజయవాడ పారిపోయివచ్చి సీబీఐ రాష్ట్రానికి రావటానికి వీల్లేదని జీవో తెచ్చిన వ్యక్తి చంద్రబాబు నాయుడని అన్నారు.పరిపాలనలో వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి తనకు అనూకూలంగా మల్చుకునే వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అన్నారు.బోండా ఉమా మాట్లాడుతున్నాడు చంద్రబాబు చిటికేస్తే జగన్ మోహన్ రెడ్డి ఇల్లు లేకుండా చేస్తామని,అదే జగన్ మోహన్ రెడ్డి చిటికేస్తే రాష్ట్రం ఏమౌతుందో అర్ధం చేసుకోవాలని హితవుపలికారు.ఇప్పుడు పార్టీ ఆఫీస్ కి రండి అని సవాల్ విసురుతున్నడూ లోకేష్,ముందు నువ్వు కనీసం వార్డు కౌన్సిలర్ గా ఐనా గెలిసి అప్పుడు సవాల్ కి రా,నువ్వు పనికిరావనే మీనాన్న కుంగి కూసించిపోయి ధర్నాకు కూర్చున్నాడు,చంద్రబాబు రెచ్చగొట్టే విధంగా మాట్లాడిస్తూ కుయుక్తులు పన్నుచున్నాడని,ప్రజలకు చంద్రబాబు సంగతి తెలుసు అని అన్నారు.కండ్లగుంట్ల లో అయ్యన్నపాత్రుడు మాట్లాడిన తీరు వెంటనే తెలిసుంటే అప్పుడే అడ్డుకునే వాళ్ళం అని ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు వైయస్సార్సిపి నాయకులు,ఎంఐఎం పార్టీ నాయకులు,ఎమ్మార్పీఎస్ నాయకులు,అభిమానులు మహిళలు,కార్యకర్తలు పాల్గొన్నారులి

## జనాగ్రహ దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ మొండి తోక జగన్ మోహన్ రావు, ఏపీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అరుణ్ కుమార్



నందిగామ అక్టోబర్ 22 ప్రజా పాలన ప్రతినిధి: వైసిపి పార్టీ ఆధ్వర్యంలో రెండవ రోజు జనాగ్రహ దీక్షను చే పట్టారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జగ న్మో హన్ రావు ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భా గంగా వారు మాట్లాడుతూతెలుగుదేశం పార్టీ బూతు వ్యాఖ్యలు ప్రజలను బాధించటంతో పాటు ,ఆగ్రహాన్ని కలిగించాయన్నారు. ముఖ్యమంత్రి పై అనుచిత వ్యా ఖ్యలు చేసిన పట్టాభి రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణు లతో పాటు ప్రజలకు కూడా ఆగ్రహం తెచ్చేవిధంగా బూతు పురాణం మాట్లాడారని ,చంద్రబాబు డైరెక్షన్లో నే తెలుగుదేశం పార్టీ నేతలు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు.అనుచిత వ్యాఖ్యలు చే య డమే కాకుండా ,అటువంటి వ్యాఖ్యలు చేసిన పట్టా బిని సమర్థిస్తూ చంద్రబాబు నాయుడు 36 గంటల దీ క్ష చేయటం అప్రజాస్వామికమని ,ఇటువంటి విధానా లను అనుసరిస్తున్న తెలుగుదేశం పార్టీ వైఖరికి నిరస నగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనాగ్రహ దీక్ష చేపట్టడం జరిగిందని తెలిపారు ,ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించాల్సిన తెలుగుదేశం పార్టీ నేతలు సద్వి మర్శలు చేయాలి కానీ ఇటువంటి నిజమైన వ్యాఖ్య లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు

## మంద కృష్ణ మాదిగని పరామర్శించిన మాజీ శాస నసభ్యురాలు తంగిరాల సౌమ్య



నందిగామ అక్టోబర్ 22 ప్రజా పాలన ప్రతినిధి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఇటీవల కాలికి గాయమై శస్త్రచికిత్స అనంతరం విజయవాడ లో విశ్రాంతి తీసుకుంటున్న మంద కృష్ణ మాదిగని గురువారం సాయంత్రం మాజీ శాసనస భ్యురాలు సౌమ్య కలిసి పరామర్శించి, ఆయన ఆ రోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమములో తెదేపా నేతలు పాల్గొన్నారు.

# లాసెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

రెక్టార్ డి.శారద, రిజిస్ట్రార్ మమత పాల్గొన్నారు.

మూడేళ్ల ఎల్ఎల్‌బీలో హరిప్రియకు మొదటి ర్యాంకు

మూడేళ్ల ఎల్ఎల్‌బీలో మోపూరు హరిప్రియ (విజయవాడ రూరల్) మొదటి ర్యాంకు పొందారు. ఏపీ ట్రాన్స్‌కోలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మోపూరు హరిప్రియ 53 ఏళ్ల వయసులో ఈ ర్యాంక్ సాధించడం విశేషం ఎల్.రాజా (గుంటూరు) రెండో ర్యాంకు, కె.హరికృష్ణ (అనంతపురం) మూడో ర్యాంకు సాధించారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీకి సంబంధించి ఎం.మౌనిక బాయి (బనగానపల్లె, కర్నూలు జిల్లా) మొదటి ర్యాంకు పొందారు. వి.నాగసాయి ప్రశాంతి (రణస్థలం, శ్రీకాకుళం జిల్లా) రెండో ర్యాంకు, సునీల్ (పూసపాటిరేగ, విజయనగరం జిల్లా) మూడో ర్యాంకు సాధించారు. ఇక రెండేళ్ల ఎల్ఎల్ఎం ప్రవేశపరీక్షలో వై.గీతిక (విశాఖపట్నం) మొదటి ర్యాంకు పొందారు. కె.కృష్ణమ నాయుడు (ఆమదాలవలస, శ్రీకాకుళం జిల్లా) రెండో ర్యాంకు, టి.రమేష్ బాబు (విజయవాడ) మూడో ర్యాంకు సాధించారు.

## నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ... పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కర్మాగారం సిద్ధమైందని అధికారులు సీఎం జగన్‌కు వెల్లడించారు. ప్రతిపాదిత ప్రాంతాల్లో కూడా ఈ ప్లాంట్లపై దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి తెలిపారు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణపై అధికారులు దృష్టిపెట్టాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించడంపైనే కాదు, వాటిని పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేక దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. గ్రామాల్లో డస్ట్‌బిన్స్ లేని వాళ్లకు డస్ట్‌బిన్స్ ఇవ్వాలని, విలేజ్ క్లినిక్స్ ద్వారా నీరు, గాలిలో కాలుష్యంపై పరీక్షలు చేయించాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యంపైనా నివేదికలు తెప్పించుకుని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా తాగునీటి వాటర్ ట్యాంక్‌లను పరిశుభ్రం చేయించాలన్నారు. 'వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై నిరంతరం దృష్టిపెట్టాలి. మురుగునీటి కాల్వల నిర్వహణపై అధికారులు దృష్టిపెట్టాలి. ఎక్కడా కూడా మురుగునీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి. నివాస ప్రాంతాల్లో మురుగునీటి నిల్వ లేకుండా చేయాలి. దీన్నొక సవాల్‌గా తీసుకోవాలి. అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్లలో అత్యాధునిక విధానాలను పాటించాలి. క్లాప్ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తున్న కమాండ్ కంట్రోల్ రూపంలో సమర్థులైన అధికారులను పెట్టాలి. వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలి' అని సీఎం అధికారులను ఆదేశించారు.

## మోదీ చెప్తున్నదంతా అరకొర సమాచారం : కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించిన అనంతరం కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై మండిపడింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సరైనది కానటువంటి, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రజల ముందు ఉంచుతున్నారన్నారు. మన దేశ సైంటిఫిక్ కమ్యూనిటీ, పరిశోధకులు చేసిన కఠోర శ్రమను మోదీ గుర్తించడం లేదన్నారు. భారత దేశం వ్యాక్సిన్‌ను తయారు చేయడం ఇదే తొలిసారి అని మోదీ అంటున్నారని, ఆయన మన పరిశోధకులు, శాస్త్రవేత్తల కృషిని పట్టించుకోవడం లేదని అన్నారు. 1985లో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ ఆరు వ్యాధులకు టీకాకరణను ప్రారంభించారన్నారు. సార్వత్రిక వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని కూడా రాజీవ్ గాంధీ ప్రారంభించారన్నారు. మోదీ మాదిరిగా ఆయన ఎటువంటి ఆర్భాటాలు చేయలేదన్నారు. తక్కువ జనాభాగల దేశాలతో భారత దేశాన్ని మోదీ పోల్చుతున్నారన్నారు. చైనా 216 కోట్ల వ్యాక్సిన్ డోసులను ఇచ్చిందని, జనాభాలో 80 శాతం మందికి రెండు డోసులను ఇచ్చిందని తెలిపారు. భారత దేశం కేవలం 21 శాతం జనాభాకే రెండు డోసుల వ్యాక్సిన్‌ను ఇచ్చిందన్నారు. కోవిడ్ మహమ్మారి రెండో ప్రభంజనం సమయంలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసమర్థత, దయనీయమైన పాలన కారణంగానే ఈ మరణాలు సంభవించాయని ఆరోపించారు.

# మంత్రి కొడాలి నాని నివాసం వద్ద అభిమానుల కోలాహలం

## నిరాడంబరంగా జరిగిన పుట్టినరోజు వేడుకలు
## భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు
## శుభాకాంక్షలు తెలిపిన అధికార, అనధికార ప్రముఖులు





గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి అక్టోబర్ 22: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పుట్టినరోజు వేడుకలు శుక్రవారం నిరాడంబరంగా జరిగాయి. కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం రాజేంద్రనగర్లోని నివాసం రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన అభిమానులతో కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికార, అనధికార ప్రముఖులు మంత్రి కొడాలి నానికి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మంత్రి కొడాలి నానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అర్చకులు, చర్చి ఫాదర్లు, మసీదు ఇమామ్ లు వేర్వేరుగా సర్వమత ప్రార్ధనలు నిర్వహించి మంత్రి కొడాలి నాని నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని, రాజకీయాల్లో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని దేవుడిని ప్రార్థించారు. గుడివాడ డీఎస్పీ ఎన్ సత్యానందం ఆధ్వర్యంలో సబ్ డివిజన్లోని పోలీసు అధికారులంతా మంత్రి కొడాలి నానిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసుల సమక్షంలో మంత్రి కొడాలి నాని పుట్టినరోజు కేక్ కట్ చేసి డీఎస్పీ సత్యానందంకు తినిపించారు. అనంతరం గుడివాడ పట్టణం ఏలూర్ రోడ్డులోని ఫర్నీచర్ పార్క్ లో మంత్రి కొడాలి నానిని పెద్దఎత్తున అభిమానులు ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్, గుడివాడ ఆర్డీవో జీ శ్రీనుకుమార్, మున్సిపల్ కమిషనర్ పీజే సంపత్కుమార్, ఆర్టీవో సీతాపతిరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్, డ్వామా పీడీ గోర్జి సూర్యనారాయణ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎం సముద్రవేణి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పడమట సుజాత, పార్టీ సీనియర్ నాయకులు పాలడుగు రాంప్రసాద్, వల్లూరుపల్లి సుధాకర్, గాదిరెడ్డి రామలింగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాబ్జి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్విక్టర్, నందివాడ మండల అధ్యక్షుడు పెయ్యల ఆదాం, కొండాలమ్మ దేవస్థానం చైర్మన్ కనుమూరి రామిరెడ్డి, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి సంఘం చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ ఎన్ మోహన్రెడ్డి, పార్టీ నాయకులు అద్దేపల్లి పురుషోత్తం, అద్దేపల్లి హరిహరప్రసాద్, సయ్యద్ గఫార్, కొంకితల ఆంజనేయ ప్రసాద్, లోయ రాజేష్, గుళ్ళపల్లి శ్రీను, మల్లిపూడి శ్రీనివాస చక్రవర్తి, ఫర్నీచర్ పార్క్ బెనర్జి, గిరి బాబాయ్, చింతల భాస్కరరావు, డొక్కు రాంబాబు, జోగా సూర్యప్రకాశరావు, అడబాల అప్పారావు, సింహాద్రి శివరాంబాబు, బొగ్గరపు తిరుపతయ్య, అల్లూరి ఆంజనేయులు, ముద్దినేని దుర్గానాయుడు, గోవాడ చంటి, మాదాసు వెంకటలక్ష్మి, అల్లం రామ్మోహన్, అల్లం సూర్యప్రభ, షేక్ బాజీ, రహ్మతుల్లా షరీఫ్, షేక్ మౌలాలి, తప్పిట నీలిమ, ఈడే వెంకటేశ్వరమ్మ, ఈడే వెంకటేశ్వరరావు, యేల్చూరి వేణు, తాళ్ళూరి ప్రశాంత్, సునీత, రమీజ, హారిక తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు మనస్సు మార్చాలని జనాగ్రహ యాత్ర



పొన్నూరు అక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి: చంద్రబాబు కు మంచి మనసు ప్రసాదించాలని,అతని బుద్ధి మార్చాలని పొన్నూరు వైసీపీ నాయలులు శుక్రవారం విజయవాడ గుణదల చేరుకున్నారు.మాజీ మునిసిపల్ చైర్పర్సన్ డాక్టర్ ఎన్. రూత్ రాణి ఆధ్వర్యంలోజనాగ్రహయాత్ర చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు ఫ్లెక్సీ చేతబట్టి ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్న చంద్రబాబుకు మంచిమనసు ప్రసాదించాలని దేవుని మొక్కారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రూత్ రాణి,వడ్రాణం ప్రసాదరావు,నాజర్,డక్కుమల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి: కాసల కోనయ్య



కావలి అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి :అభంశుభం తెలియని దళిత మైనర్ బాలికపై అత్యాచారం కు పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘ జాతీయ అద్యక్షుడు కాసల కోనయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్ నందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ కొండాపురం మండలం రామంజపురంలో ఈ నెల 14 తేది దళిత మైనర్ బాలికపై హత్యాచారం జరిగితే ఇంతవరకు పోలీసులు చర్యలు తీసుకోకపోవటం శోచనీయమన్నారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న డియస్పీ ,సిఐ తో కూడా మాట్లాడటం జరిగిందన్నారు. భాధిత మహిళ వైద్య పరిక్షల రిపోర్ట్స్ రాగానే పోలీసులు చర్యలు తీసుకోకపోతే జిల్లా స్థాయి ,రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలపై ,చిన్నారులపై హత్యాచారాలు ఆగటం లేదన్నారు. చట్టాలను మరింత కఠినం చేయాల్సిన అవసరం ఉందని ఆయన వ్యక్తం చేశారు. దిశ చట్టం అంటే క దశ దిశ లేకుండా ఉందన్నారు. అలానే హత్యాచారంకు గురైన భాధితురాలిని ఆమె గ్రామంలో కలసి ఆమెకు ధైర్యం చెప్పి ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం ఆద్వర్యంలో కొంత ఆర్థిక సహాయం కూడా చేస్తామన్నారు. ఇప్పటికైనా పోలీసులు సత్వరం స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం క్రమశిక్షణ సంఘ ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాల అద్యక్షుడు వి లక్షమయ్య జిల్లా అద్యక్షుడు మెహమ్మద్ అబ్దుల్ అలీమ్ ,జిల్లా మహిళా అద్యక్షురాలు కామాక్షి ,కావలి మండల అద్యక్షుడు గొట్టిపాటి అంకయ్య , సభ్యులు శేషగిరి,సోమిశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సారాయి పై కఠిన చర్యలు తప్పవు



బిట్రగుంట అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి : మండలంలో సారాయి తయారు చేసిన , విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని బిట్రగుంట ఎస్ ఐ చిన్న బలరామయ్య పేర్కొన్నారు.అల్లూరు మండలం నుండి బిట్రగుంట పోలీస్ స్టేషన్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించ ఆయన మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా సారాయి తయారు చేసిన ,విక్రయించిన వారిపై రంగా కఠిన శిక్షలు తప్పవని , సారాయి తక్కువ ధరకే వస్తుందని మద్యం ప్రియులు సారాయి తాగి అనారోగ్యం బారిన పడుతున్నారని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సారాయి మానిపించే విధంగా చర్యలు తీసుకుంటామని ,మండలంలో సారాయిని అరికట్టడంలో ప్రజల సహకారం అందించాలని అన్నారు. నేరాలను అరికట్టే లో భాగంగా రాత్రుల్లో పోలీసులు గస్తీని ఏర్పాటు చేస్తామని , బోగోలు బజార్ సెంటర్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నందువల్ల దుకాణాదారులు లతో మాట్లాడి ట్రాఫిక్కు ఇబ్బంది లేకుండా దుకాణాల ముందు బండ్లను పార్కింగ్ లేకుండా చూస్తామని అన్నారు. మండలంలో ఎక్కడైనా చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలు జరిగితే పోలీసు వారి దృష్టికి తీసుకురావాలని ప్రజల్ని కోరుతున్నామన్నారు.

# సీనియర్లపై సీరియస్

విజయవాడ, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఒంటరి పోరు చేయక తప్పడం లేదు. పార్టీ నేతలు పెద్దగా కలసి రారని తెలిసే ఒంటరిగా ఆయన దీక్షకు దిగారని తెలిసింది. పార్టీ కార్యాలయాలపై పెద్దయెత్తున వైసీపీ శ్రేణులు దాడులకు దిగినా నేతల్లో పెద్దగా చైతన్యం రాకపోవడాన్ని చంద్రబాబు తీవ్రంగా తప్పుపడుతున్నారు. బంద్ విషయంలో పోలీసులు ముందస్తు అరెస్ట్ లు చేస్తారని తెలిసి అందుకు తగిన ఏర్పాట్లు ఎందుకు చేసుకోలేదని ప్రశ్నిస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యాలయాలపై దాడులు జరగడంతో టీడీపీ శ్రేణుల్లోనూ మార్పు వస్తుందని చంద్రబాబు భావించారు. అందుకే వారిలో ఉత్తేజాన్ని నింపడం కోసం బంద్ కు పిలుపు నిచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో బంద్ జరగలేదు. ఒకరకంగా బంద్ విఫలమయిందనే చెప్పాలి. నిన్న సాయంత్రానికి జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకున్న చంద్రబాబు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.అందుకే తాను ఒంటరిగా 36 గంటలు దీక్షలు చేయాలని నిర్ణయించారు. గతంలోనూ రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చినా పెద్దగా స్పందన రాలేదు. పార్టీ నేతలు కేవలం ఫొటోలు తీయించుకుని కేంద్ర కార్యాలయానికి పంపి గంటలోనే కార్యక్రమాన్ని ముగించారు. అందుకే చంద్రబాబు ఈసారి ఆ తప్పిదం చేయదలచుకోలేదు. తాను ఒంటరిగానే దీక్షకు దిగాలని నిర్ణయించుకున్నారు.మరోవైపు పార్టీ కార్యాలయాలపై దాడులు జరిగినా స్పందించని నేతలపై చంద్రబాబు సీరియస్ అయినట్లు తెలిసింది. ఇప్పుడు కాక ఇంకెప్పుడు మీరు బయటకు వస్తారని కోస్తాంధ్రలోని కొందరి నేతలను చంద్రబాబు సూటిగానే ప్రశ్నించినట్లు సమాచారం. నేతలే ముదుకు రాకపోతే ఇక కార్యకర్తలు బయటకు ఎలా వస్తారని ప్రకాశం జిల్లాలోని సీనియర్ నేతకు చంద్రబాబు బాగానే క్లాస్ పీకినట్లు చెబుతున్నారు. మొత్తం మీద బంద్ విషయంలోనూ నేతలు చంద్రబాబు ఆశించినట్లు వ్యవహరించకపోవడం పట్ల ఆయన కోపంతో రగలిపోతున్నట్లు తెలిసింది.

## భూ రీసర్వే పరిశీలించిన ఆర్డివో



బిట్రగుంట అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి :బోగోలు మండలం సాంబశివ పురం గ్రామంలో శుక్రవారం కావాలి ఆర్డీఓ శీను నాయక్ ఈ సర్వేను పరిశీలించారు. గ్రౌండ్ త్రుతింగ్ లో భాగంగా 650 ఎకరాలకు గాను ఐదు వందల యాభై ఎకరాలు వరకు గ్రౌండ్ ట్రుతింగ్ జరిగిందని ఆర్డిఓ తెలిపారు. గ్రామంలో ఆధునిక సాంకేతిక తో రూపొందించి చేపడుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు దీనిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు .ఆయన వెంట బోగోలు తహసీల్దార్ లక్ష్మీనారాయణ డి ఈ ఐ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ ఐ గీత, వీఆర్వో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టారెత్తిస్తున్న టమాటా

తిరుపతి, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: టమాటా దిగుబడులపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. మార్కెట్కు అంతంతమాత్రంగా వస్తున్న టమాటా దిగుబడులు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మరింతగా తగ్గిపోయాయి. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో కాయలపై మచ్చలు వచ్చి.. తెగుళ్లు సోకుతున్నాయి. పంట నాణ్యతగా ఉండడం లేదు. గత నెల 9న రైతులు మార్కెట్కు 445 మెట్రిక్ టన్నుల టమాటాలు తీసుకువచ్చారు. ఇందులో మెదటి రకం టమాట ధర కిలో రూ.14 వరకు పలికింది. ప్రస్తుతం దిగుబడులు 70 శాతం మేర తగ్గిపోయింది.ఇతర రాష్ట్రాల్లో వర్షాలకు పంట దెబ్బతినడం, డిమాండ్కు తగ్గ సరుకు లేకపోవడంతో ధరలు పెరిగిపోతున్నాయి. శనివారం చిత్తూరు జిల్లా మదనపల్లె మార్కెట్ యార్డులో మొదటిరకం టమాటా ధర కిలో రూ.35 నుంచి రూ.52 మధ్య పలికింది. రెండో రకం రూ.16 నుంచి రూ.33 మధ్య నమోదైంది. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల నుంచి రైతులు 86 మెట్రిక్ టన్నుల టమాటాను మార్కెట్కు తీసుకువచ్చారు. కోత దశ చివరిది కావడంతో టమాటా దిగుబడులు తగ్గాయని, రబీ సీజన్ ప్రారంభమయ్యాక దిగుబడులు పెరిగే అవకాశం ఉందని హార్టికల్చరల్ ఆఫీసర్ సౌజన్య తెలిపారు.

# మూడు దసరాలు పూర్తి



విజయవాడ, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ ముఖ్యమంత్రిగా జగన్ విజయం సాధించాక ఇప్పటికి మూడు దసరాలు ముగిశాయి. ఈసారి దసరాకు కూడా విశాఖకు రాజధాని తరలింపు సాధ్యం కాలేదు. శాసనసభలో జగన్ మూడు రాజధానుల ప్రకటన చేసిన తర్వాత ఉగాది, దసరాలు ఎన్నో వెళ్లిపోయాయి. ప్రతి సారి రాజధాని తరలింపు సాధ్యం కాకపోయినా ముఖ్యమంత్రి జగన్ తన క్యాంప్ కార్యాలయాన్ని తరలిస్తారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. అయినా సాధ్యం కాలేదు.గత రెండున్నరేళు ్లగా వైఎస్ జగన్ తాడేపల్లి క్యాంప కార్యాలయం నుంచే తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. సచివాలయానికి మంత్రివర్గ సమావేశాలు ఉంటే తప్ప వెళ్లడం లేదు. క్యాంపు కార్యాలయం నుంచే లబ్దిదారులకు బటన్ నొక్కి నగదును విడుదల చేస్తున్నారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలు కూడా అక్కడి నుంచే. అయితే ఈసారి క్యాంప్ కార్యాలయాన్ని విశాఖకు తరలించి అక్కడి నుంచి కార్యకలాపాలు చేస్తారని చెప్పారు.విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ ప్రచారం సాగింది. విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో ఒక భవనాన్ని సీఎం క్యాంప్ కార్యాలయం కోసం చూశారని కూడా వార్తలొచ్చాయి. అప్పట్లో సీఎంవోలో ఉన్న ప్రవీణ్ ప్రకాష్ తో పాటు డీజీపీ గౌతం సవాంగ్ సయితం విశాఖను సందర్శించారు. ఇంకేముంది జగన్ విశాఖలో కాలుమోపడానికి ముహూర్తమే తరువాయి అని వైసీపీ నేతలు ఆర్భాటపు ప్రకటన చేశారు.అయితే అమరావతి రాజధాని అంశం కోర్టు పరిధిలో ఉన్నందున కనీసం క్యాంప్ కార్యాలయాన్ని కూడా విశాఖకు తరలించే సాహసాన్ని జగన్ చేయలేకపోతున్నారు. పరిపాలన రాజధాని తరలింపు మూడేళ్ల పాటు సాధ్యం కాలేదు. వచ్చే రెండేళ్లలో కూడా తరలించకపోతే జగన్ చేసిన ప్రకటనకు విలువ ఉండదు. అందుకే విశాఖ వైసీపీ నేతలు క్యాంప్ కార్యాలయాన్ని అయినా తరలించాలని కోరుతున్నారు. మరి ఈ రెండేళ్లలో అది సాధ్యమవుతుందా? అన్నది సందేహమే.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్కు వచ్చే లాభాలను మెంబర్స్కు ఇవ్వటం జరుగుతోంది

అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

# ప్రజాపాలన


**సంపాదకీయం**

**శనివారం 23, అక్టోబరు 2021**


## పభుత్వ నిర్లక్ష్యమే ఇంటిదొంగలకు వరమైంది!

తెలుగు అకాడెమీలో బయటపడ్డ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డి) కుంభకోణం మొదట ముప్పై కోట్లు అన్నారు. ఇప్పుడది వేరే శాఖలకు కూడా పాకి పెద్దమొత్తంలోనే గోల్మాల్ జరిగిందని తేలింది. అది దాదాపు రెండు వందల కోట్ల వరకు ఉండవచ్చుననే అంచనాలకు వస్తున్నారు. ఈ వ్యవహారంలో తెలుగు అకాడమీతో పాటు, హౌసింగ్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఆంధ్రప్రదేశ్ మైనారిటీ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ నెడ్‌కాప్ కాకుండా ఇంకా కొన్ని సంస్థలకు కూడా పాత్ర ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అసలు ఈ డబ్బు ప్రభుత్వ ట్రెజరీ కార్యాలయాలలో పర్సనల్ డిపాజిట్ (పిడి) ఖాతాల్లో ఉండవలసింది, కానీ బ్యాంకులకు ఎలా తరలింది? అధికారులు దాన్ని నిర్దేశించిన కార్యక్రమాలకు వినియోగించకుండా బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఎందుకు దాచారు? ఏళ్ల తరబడి ఆ డబ్బు బ్యాంకులలో డిపాజిట్ లాగా ఎందుకు మూలుగుతోంది? ఆ దాచిన వివరాలు సరిగా రికార్డులలో పొందుపరిచారా? ఎవరో కొందరు ప్రభుత్వ అధికారుల స్వార్థం కారణంగా రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి, పిడి అకౌంట్లకు, అక్కడినుంచి బ్యాంకులకు తరలి ఇప్పుడు అక్రమార్కుల చేతిలో పడింది. ఇదంతా ప్రజాధనం. దీని దుర్వినియోగానికి బాధ్యత ఎవరిది? రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయమంతా రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండుకు జమ చేయాలని, ప్రభుత్వ ఖర్చులన్నీ రాజ్యాంగ నిబంధనలకు లోబడి చేసిన చట్టాలకు అనుగుణంగా మాత్రమే జరగాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 266 స్పష్టంగా చెబుతోంది. అయితే ఇప్పుడు ఇది నామమాత్రంగానే జరుగుతోంది. ప్రభుత్వం అనేక పద్దుల కింద, వివిధ కార్యక్రమాలు, పథకాల అమలు కోసం నిధులను వెచ్చిస్తుంది. వాటికి పెట్టే ఖర్చు, జమలను ప్రత్యేకంగా పర్యవేక్షించడం కోసం ప్రత్యేక పర్సనల్ డిపాజిట్ ఖాతాలు ఉంటే తేలిక అనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ట్రెజరీలలో పి.డి. ఖాతాలను తెరవడానికి నిబంధనలు రూపొందించింది. ఈ పిడి ఖాతాలు మన బ్యాంకు ఖాతాల లాగానే ప్రభుత్వ ట్రెజరీలలో ఉంటాయి. ఉదాహరణకు ప్రభుత్వం ఒక వంద కోట్లతో ఒక ప్రాజెక్టు నిర్మిద్దాం అనుకున్నప్పుడు, ట్రెజరీలో ఒక ప్రత్యేక పిడి ఖాతా తెరిచి ఆ వంద కోట్లను రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి దానికి బదిలీ చేస్తుంది. ఈ ఖాతా నుంచే ప్రాజెక్టుకు ఖర్చు పెడుతుంది. ఇదీ ప్రభుత్వ ఉద్దేశ్యం. అయితే ప్రభుత్వ పథకాల వంటి వాటి అమలు కోసం తెరిచే పిడి ఖాతాలను ప్రతి ఆర్థిక సంవత్సరం చివర్లో మూసేసి దాంట్లో మిగిలిన నిధులను మళ్ళీ కన్సాలిడేటెడ్ ఫండుకు జమ చేయాలని, ఒకవేళ తదుపరి ఆర్థిక సంవత్సరంలో మళ్ళీ ఆ పథకం కోసం నిధులు అవసరమైతే మళ్ళీ పిడి ఖాతాను ప్రారంభించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని ఆర్టికల్ 271 స్పష్టంచేస్తోంది.ఏదైనా ప్రభుత్వ శాఖ ఒక పిడి ఖాతా తెరవాలన్నా, లేదా ప్రభుత్వ నిధులను ఏదైనా బ్యాంకులో డిపాజిట్‌గా ఉంచాలన్నా, ముందుగా ప్రభుత్వ ఆడిటర్ అయిన ఎకౌంటెంట్ జనరల్‌ను సంప్రదించడం, ముందస్తు అనుమతి తీసుకోవడం మొదట్లో ఒక ఆనవాయితీగా ఉండేది. దీని వల్ల అకౌంటెంట్ జనరల్ వద్ద ఈ అకౌంట్ల వివరాలు ఉండేవి. అకౌంటెంట్ జనరల్‌కు వాటి నిర్వహణ మీద అదుపు ఉండేది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక విభాగం జూన్ 02, 2005న జారీ చేసిన జీవో ఎంఎస్ నం.140లో ఈ పిడి ఖాతాలను తెరిచిన తరువాత అకౌంటెంట్ జనరల్‌కు నోటిఫై చేయవచ్చుని పేర్కొందది. దాంతో అకౌంటెంట్ జనరల్ అనుమతితో మాత్రమే పిడి ఖాతాలను తెరవాలనే నిబంధనకు నీళ్ళు వదిలినట్లయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలు ఇష్టానుసారంగా పిడి ఖాతాలు తెరవడానికి అనుమతి ఇవ్వడం ప్రారంభించాయి. ఏప్రిల్ 01, 2017 నాటికి పశ్చిమ బెంగాల్‌లో 153, గుజరాత్‌లో 478, ఒడిశాలో 827 పిడి ఖాతాలు ఉంటే ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 58,539 ఖాతాలు ఉన్నాయని, ఆ ఖాతాలలో రూ.26,514కోట్ల నిధులు నిరుపయోగంగా ఉన్నాయని, అలా ఇబ్బడిముబ్బడిగా తెరవడం వల్ల వీటి పర్యవేక్షణ కష్టం అవుతుందని ఆడిట్ నివేదిక స్పష్టం చేసింది. ప్రభుత్వపరంగా ఏదైనా వాణిజ్య పథకాన్ని అమలు చేయడానికి అనుమతి ఇస్తే మాత్రం ఆ పిడి ఖాతాను ఆర్థిక సంవత్సరంలో మూసేయకుండా పథకం అమలు పూర్తి అయ్యేవరకు ఉంచవచ్చు అనే ప్రభుత్వ నిబంధన కూడా ఉంది. దీన్ని లొసుగుగా తీసుకొని దాదాపు అన్ని ప్రభుత్వ శాఖాలూ పి.డి. ఖాతాలను క్లోజ్ చేయకుండా కొనసాగించటం మొదలుపెట్టాయి. ఒకపక్క ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం అప్పులు చేస్తుంటే, అధికారులు ఈ పిడి ఖాతాలలోని మిగిలిన నిధులను బ్యాంకులకు డిపాజిట్‌లుగా తరలించడం ప్రారంభమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఆ పిడి ఖాతాల నిర్వహణ చాలా అస్తవ్యస్తంగా ఉన్నదని అకౌంటెంట్ జనరల్ ఆడిట్ నివేదికలలో పలుమార్లు స్పష్టం చేశారు. అయినా ప్రభుత్వ అధికారుల తీరులో కానీ, ప్రభుత్వంలో గాని చలనం లేదు. అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వ నిధులను అధికారులు పిడి ఖాతాల నుంచి బ్యాంకులలోని సేవింగ్స్ ఖాతాలకు, కరెంట్ ఖాతాలకు, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలకు తరలించడం గురించి ఆ ఆడిట్ నివేదిక ప్రముఖంగా పేర్కొన్నది. ఈ విధమైన తరలింపునకు ప్రభుత్వ నిబంధనలు అంగీకరించకపోయినా అధికారులు ఆ పని చేస్తూనే ఉన్నారు.. ఇలా ప్రభుత్వ నిధులను బ్యాంకు ఖాతాలకు తరలించి ఏళ్ల తరబడి పట్టించుకోకుండా ఉండడం వల్లనే అక్రమార్కులు ఈ తెలుగు అకాడెమీ తరహా మోసాలకు తెర తీశారు. అసలు తెలుగు అకాడెమీ ఖాతాలో 64కోట్లు ఏళ్ల తరబడి ఎందుకు ఉన్నాయి? ఇంకా ఎన్ని ప్రభుత్వ శాఖలలో ఇటువంటి డిపాజిట్లు ఉన్నాయి?ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ ఖజానా శాఖ నవంబరు 16, 2009న ఇచ్చిన ఉత్తర్వులలో 'ప్రజల సొమ్ము ప్రభుత్వం వద్ద అన్నా ఉండాలి లేదా లబ్ధిదారుకు చేరాలి కానీ మధ్యలో ఉండకూడదని' స్పష్టంగా పేర్కొని, అలా బ్యాంకులలో ఉన్న నిధులు వెంటనే ప్రభుత్వ ఖాతాకు జమ చేయమని కోరింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ఫిబ్రవరి 04, 2012న ఉత్తర్వులు ఇస్తూ ప్రభుత్వ నిధులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లగా తరలించవద్దని ఆదేశించింది. అయినా కూడా వివిధ బ్యాంకు అకౌంట్లలో ప్రభుత్వ నిధులు మూలుగుతున్నాయని తెలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ అక్టోబరు 14, 2016న జీవో ఎంఎస్ నం.196 ద్వారా అప్పటి ప్రభుత్వ లెక్కల ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలు 12 బ్యాంకులలో 70,924 అకౌంట్లను కలిగి ఉన్నాయని, వాటిలో రూ.19,611కోట్ల నిధులు ఉన్నాయని పేర్కొంది. ఇవన్నీ డ్రా చేసి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. అయినా ఈ ఉత్తర్వులు ఏవి అమలు కాలేదని 2016%--%2017 ఇచ్చిన ఆడిట్ నివేదికే పేర్కొన్నది. నిర్లక్ష్యం ఎక్కడ జరిగింది? ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా అధికారులు బ్యాంకు అకౌంట్లకు,ఫిక్స్‌డ్ డిపాజిట్లకు నిధులు ఎలా తరలిస్తున్నారు అనే మౌలిక ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. శాఖాధికారులు కొందరు పిడి ఎకౌంట్లలో నుంచి నిధులను బ్యాంకులు ఇచ్చే కమీషన్ల కోసం ఆశపడి ఫిక్స్‌డ్ డిపాజిట్‌లుగా వేయడం, ఆ నిధులను మూడు నాలుగేళ్ల పాటు అలానే ఉంచి, తాము అక్కడ నించి బదిలీ అయ్యేటప్పుడు తమతో పాటే ఆ డిపాజిట్‌లకు సంబంధించిన రికార్డులు కూడా మాయం చేసి, బ్యాంక్ అధికారులతో కుమ్మక్కు అయ్యి ఆ నిధులు స్వాహా చేసిన ఉదంతాలు చాలా ఉన్నాయి. ప్రభుత్వ అకౌంటింగ్ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండడం, ప్రభుత్వ నిబంధలను ఉల్లంఘిస్తున్న అధికారుల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల ఇలా ప్రజాధనం దుర్వినియోగం జరుగుతోంది. దీనికి పాలకులే భాధ్యత వహించాలి.

# బిలియన్ డోసుల బృహత్ విజయం




భారతదేశం టీకాల కార్యక్రమంలో అప్రతిహత విజయం సాధించింది. ప్రారంభించిన 9 నెలల్లో 2021 అక్టోబరు 21నాటికి దేశవ్యాప్తంగా 100 కోట్ల టీకాల మైలురాయిని ఈ కార్యక్రమం అధిగమించింది. కొవిడ్-19పై సమష్టి పోరులో ముఖ్యంగా 2020 తొలినాళ్ల నాటి పరిస్థితుల దృష్ట్యా ఇదొక అత్యద్భుత విజయ ప్రస్థానం. దాదాపు వందేళ్ల తర్వాత మానవాళి ఇంతటి పెనువిపత్తును ఎదుర్కోవాల్సి వచ్చింది. పైగా ఈ వైరస్ గురించి ప్రపంచానికి ఏమాత్రం తెలియదు. అలాంటప్పుడు పరిస్థితి ఎంత అనూహ్యంగా కనిపించిందో మనం గుర్తుచేసుకోవచ్చు. వేగంగా రూపాంతరం చెందుతున్న అపరిచిత, అదృశ్య శత్రువుతో మనం పోరాడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో మన పయనం ఆందోళన నుంచి ఆనందానికి భరోసా దిశగా సాగి, జాతి మరింత బలంగా ఆవిర్భవించింది. ప్రపంచంలోనే అత్యంత భారీ టీకాల కార్యక్రమం ఇందుకు ప్రధానంగా దోహదం చేసింది.సమాజంలోని బహుళ వర్గాల కృషిని క్రోడీకరించడం నిజంగా ఓ భగీరథ ప్రయత్నమే. ఇది ఎంత భారీ ప్రయత్నమో తెలుసుకోవడానికి ఒక ఊహాత్మక అంచనా వేసుకుందాం. ప్రతి టీకా వేయడానికి ఒక ఆరోగ్య కార్యకర్తకు 2 నిమిషాలు పట్టిందనుకుందాం. ఈ వేగంతో వెళ్తే ప్రస్తుత మైలురాయిని అందుకోవడానికి సుమారు 41 లక్షల పనిదినాలు లేదా 11వేల పని సంవత్సరాలు పడుతుంది! అయితే, ఏ ప్రయత్నంలోనైనా నిలవాలన్నా, వేగం నిలబెట్టుకోవాలన్నా భాగస్వాములందరి విశ్వాసం అత్యంత కీలకం. ఒకవైపు ప్రజల్లో అపనమ్మకం, భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలు సాగినప్పటికీ టీకాలతోపాటు సంబంధిత ప్రక్రియపై జనంలో ఎంతో నమ్మకం. అదీ అమిత వేగంగా పుంజుకోవడమే ఈ కార్యక్రమ విజయానికి ఒక కారణం. కేవలం దైనందిన అవసరాలకైనా విదేశీ బ్రాండ్లను మాత్రమే విశ్వసించే వారు కొందరుంటారు. కానీ, కొవిడ్-19 టీకా విషయంలో మాత్రం భారత పౌరులు 'మేడ్ ఇన్ ఇండియా' టీకాలపై ఏకగ్రీవ ఆమోదముద్ర వేశారు. కచ్చితంగా ఇదొక వినూత్న మార్పు.జన భాగస్వామ్యం స్ఫూర్తితో ఉమ్మడి లక్ష్యం దిశగా ప్రభుత్వం, ప్రజలు ఏకోన్ముఖులై ముందడుగు వేస్తే దేశం ఎంతటి ఘన విజయాన్ని అందుకోగలదో మన టీకాల కార్యక్రమం నిర్ద్వంద్వంగా రుజువు చేసింది. భారతదేశం టీకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టినపుడు మన 130 కోట్ల ప్రజానీకం సామర్థ్యాన్ని అనేకమంది తక్కువగా అంచనా వేశారు. పౌరులందరికీ టీకా ఇవ్వాలంటే కనీసం మూడు నుంచి నాలుగు సంవత్సరాలు పడుతుందని కొందరు జోస్యం కూడా చెప్పారు. టీకాలు తీసుకోవడానికి జనం ముందుకు రాబోరని ఇంకొందరు భవిష్యవాణి వినిపించారు. మరికొందరైతే టీకాల ప్రక్రియలో గందరగోళం, దుర్వినియోగం తప్పవని ఏకంగా అమంగళం పలికారు. ఇంకా కొందరు టీకాల సరఫరా ప్రక్రియ నిర్వహణ అసాధ్యమని అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ, ప్రజలు విశ్వసనీయ భాగస్వాములైతే జనతా కర్ఫ్యూ, తదుపరి దిగ్బంధ చర్యలు ఎంతటి సత్ఫలితాలిస్తాయో మనమంతా ప్రత్యక్షంగా చూశాం.కర్తవ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను స్వీకరిస్తే అసాధ్యమంటూ ఏదీ ఉండదు. ఆ మేరకు మన ఆరోగ్య కార్యకర్తలు కొండలెక్కారు.. నదులు దాటారు.. అత్యంత దుర్గమమైన మారుమూల ప్రదేశాలకు వెళ్లి మరీ ప్రజలకు టీకాలు వేశారు. ఈ ఘనత సాధించడంలో మన యువతరం, సామాజిక కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, సామాజిక-, ఆధ్యాత్మిక నాయకులు అందరూ భాగస్వాములే. ముఖ్యంగా ప్రపంచంలోని అగ్రదేశాల్లో టీకాలపై తలెత్తిన సందేహాల స్థాయితో పోలిస్తే మన దేశంలో అది అత్యంత స్వల్పం కావడం గమనార్హం. టీకాలు వేయడంలో తమకు ప్రాధాన్యం ఇవ్వడంపై భిన్నవర్గాల ప్రయోజనాల మధ్య తీవ్ర ఒత్తిడి తలెత్తింది. అయినప్పటికీ ప్రభుత్వం మన ఇతర పథకాల్లాగా టీకాల ప్రక్రియలో 'వీఐపీ' సంస్కృతికి తావేలేదని ఘంటాపథంగా స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా 2020 తొలినాళ్లలో కొవిడ్-19 మహమ్మారి విజృంభించినపుడు, ఈ మహమ్మారిపై పోరాటంలో టీకాల తోడ్పాటే ప్రధాన ఆయుధం కాగలదని మాకు స్పష్టమైంది. తదనుగుణంగా ఆదినుంచీ సంసిద్ధతా చర్యలు చేపట్టాం. అందులో భాగంగా నిపుణుల బృందాలను ఏర్పాటు చేసి 2020 ఏప్రిల్ నుంచే మార్గ ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టాం.నేటికీ ప్రపంచంలోని కొన్ని దేశాలు మాత్రమే సొంతంగా టీకాలు రూపొందించుకున్నాయి. ఆ మేరకు 180కి పైగా దేశాలు ఇప్పటికీ పరిమిత ఉత్పత్తిదారుల సమూహంపై ఆధారపడి ఉన్నాయి. డజన్లకొద్దీ దేశాలు టీకాల సరఫరా కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. కానీ, భారతదేశం అంతలోనే 100 కోట్ల టీకా డోసుల మైలురాయిని అధిగమించింది! భారత్‌కు సొంత టీకా లేకపోవడాన్ని ఒక్కసారి ఊహించుకోండి.. ఇంత భారీ జనాభా కోసం టీకాలను ఎక్కడినుంచి తెచ్చుకోగలం? అందుకు ఎన్ని సంవత్సరాలు పట్టి ఉండేది? ఈ సందర్భంగా సకాలంలో స్పందించిన భారత శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలకే ఈ ఘనత చెందాలి. వారి ప్రతిభాపాటవాలు, కఠోర శ్రమతో భారతదేశం టీకాల విషయంలో నిజంగా 'స్వయం సమృద్ధం' కాగలిగింది. ఇంత భారీ జనసంఖ్య కోసం టీకాల డిమాండ్‌కు అనుగుణంగా మన టీకాల తయారీదారులు ఎవరికీ తీసిపోని రీతిలో ఉత్పాదన పెంచుతున్నారు.దేశం ముందడుగు వేయడంలో ప్రభుత్వాలే నిరోధకాలన్న భావన నెలకొన్న మన దేశంలో మా ప్రభుత్వం తద్భిన్నంగా ప్రగతికి వేగ చోదకంగా, సమర్థ కారకంగా రూపుదాల్చింది. ఆదినుంచీ టీకాల తయారీదారులతో భాగస్వామ్యానికి ప్రభుత్వం ముందడుగు వేసింది. వ్యవస్థాగత తోడ్పాటు, శాస్త్రీయ పరిశోధన, నిధుల లభ్యతసహా నియంత్రణ ప్రక్రియలను వేగవంతం చేయడం వంటి రూపాల్లో అండగా నిలిచింది. 'సంపూర్ణ ప్రభుత్వం' అన్నదే తారకమంత్రంగా మంత్రిత్వ శాఖలన్నీ ఒక్కతాటిపై నిలిచి, టీకా తయారీదారులకు ఎదురయ్యే అవరోధాలను తొలగిస్తూ వచ్చాయి. భారత్ వంటి సువిశాల దేశంలో టీకాలను కేవలం ఉత్పత్తి చేస్తే సరిపోదు. నిరంతర రవాణా సదుపాయంతోపాటు చివరి అంచెవరకూ చేర్చగల సామర్థ్యం కూడా ప్రధానమే. ఈ దిశగా సవాళ్లను అవగతం చేసుకోవడంలో భాగంగా ఒక టీకా బుడ్డీ ప్రయాణాన్ని ఒకసారి ఊహించుకుందాం. పుణె లేదా హైదరాబాద్‌లోని కర్మాగారం నుంచి ఆ బుడ్డీని ఏదైనా రాష్ట్రంలోని కూడలికి చేర్చాలి. అక్కడినుంచి జిల్లా కేంద్రంలోని కూడలికి ఆపైన టీకాలు వేసే కేంద్రానికి అది చేరాలి. ఇందుకోసం విమానాలు, రైళ్లు వేలాది ట్రిప్పులు తిరగాల్సిన పరిస్థితి ఉంటుంది. పైగా ఈ మొత్తం ప్రయాణంలో కేంద్రీకృత పర్యవేక్షణలో నిర్ణీత ఉష్ణోగ్రతను నిర్వహించాల్సి ఉంటుంది. ఆ మేరకు దేశవ్యాప్తంగాగల లక్షకుపైగా శీతల నిల్వ పరికర సదుపాయాలను వాడుకున్నాం. టీకాల సరఫరా సమయం గురించి రాష్ట్రాలకు ముందస్తు సమాచారం ఇచ్చి, తద్వారా టీకాల కార్యక్రమంపై మెరుగైన సంసిద్ధతకు వీలు కల్పించాం. తదనుగుణంగా టీకాలు నిర్దేశిత రోజుల్లో వారికి చేరాయి. స్వతంత్ర భారతదేశంలో మునుపెన్నడూ ఎరుగని అకుంఠిత దీక్షకు ఇది నిదర్శనం.ఈ కృషి మొత్తానికీ వేగవంతమైన 'కో-విన్' వేదిక ఎంతగానో తోడ్పడింది. టీకాల కార్యక్రమం సమానంగా, అంచనాలకు- అనుసరణకు తగినట్లుగా, పారదర్శకంగా, వేగంగా సాగిపోవడంలో దీని పాత్ర అమోఘం. వరుస తప్పి రావడం, ఆశ్రిత పక్షపాతం వంటివాటికి ఇది తావులేకుండా చేసింది. ఓ పేద కార్మికుడు తొలి మోతాదును తన గ్రామంలో స్వీకరించి, నిర్దేశిత వ్యవధి తర్వాత అదే టీకా రెండో మోతాదును తాను పనిచేసే నగరంలో తీసుకునే వెసులుబాటు కలిగింది. దీంతోపాటు పారదర్శకతకు ఊతమిస్తూ ఎప్పటికప్పుడు 'క్యూఆర్' కోడ్ సహిత ధ్రువీకరణ పత్రాల జారీ కూడా పూర్తి చేయబడింది. భారత్‌లోనే కాకుండా ప్రపంచంలోనే ఇలాంటి ఉదాహరణలు ఇంకెక్కడా లేవంటే అతిశయోక్తి కాబోదు. మన దేశం వేగంగా ముందడుగు వేస్తున్నదని, ఇందుకు 'భారత జట్టు' చోదకంగా ఉన్నదని నేను 2015లో నా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం సందర్భంగా ప్రకటించాను. ఈ 'భారత జట్టు'లో 130 కోట్లమంది భారతీయులూ సభ్యులే. ప్రజా భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి అతిపెద్ద బలం. ఆ మేరకు 130 కోట్లమంది భారతీయుల భాగస్వామ్యంతో మన దేశాన్ని నడిపిస్తే ప్రతి క్షణానికీ భారత్ 130 కోట్ల అడుగులు ముందుకు వేస్తుంది. మన టీకాల కార్యక్రమం ఈ 'భారత జట్టు' సత్తాను మరోసారి ప్రపంచానికి ఘనంగా చాటింది. టీకాల కార్యక్రమంలో భారత్ విజయంతో 'ప్రజాస్వామ్యం ప్రభావం చూపగలద'ని మొత్తం ప్రపంచానికి నేడు అవగతమైంది. ప్రపంచంలోనే అత్యంత భారీ టీకాల కార్యక్రమంలో మన విజయం యువతరంలో మరింత ఉత్తేజం నింపగలదని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. అలాగే మన ఆవిష్కర్తలు, అన్ని స్థాయిలలోని ప్రభుత్వ విభాగాలు ప్రజలకు సేవా ప్రదానంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పగలవని పూర్తిగా నమ్ముతున్నాను. ఇది మన దేశానికే కాదు.. ప్రపంచానికే ఆదర్శప్రాయం కాగలదని నొక్కి చెబుతున్నాను.

# ఎడారి దేశాల్లో అత్యాచారాలు అసంభవం

ృవిలాస జీవనానికి అందరూ ఆరాటపడుతున్న కాలమిది. అందులో భాగంగా మత్తుపదార్థాల వినియోగం పెరిగిపోతోంది. మద్యం విక్రయాలు మరింతగా వర్ధిల్లుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లలో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటున్న అశ్లీలంపై సమాజం మౌనం వహిస్తోంది. ప్రత్యేకించి యువతను లక్ష్యంగా చేసుకుని కొనసాగుతున్న మత్తుపదార్థాల విక్రయంలో విద్యార్థులే విక్రేతలుగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అధికార, రాజకీయ ప్రముఖుల అండతో పెరిగిపోతున్న పబ్‌ల సంస్కృతి సహజంగా యువతపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. హైదరాబాద్‌కు వచ్చే పెట్టుబడిదారులకు మౌలిక సదుపాయాల వసతి, ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు నగరంలో ఏ రుచులకు అనుగుణంగా ఏ పబ్‌లు ఉన్నాయో కూడ పెద్దలు చెబుతారని వినికిడి. సుదీర్ఘ సమయం పాటు ఇంటర్నెట్‌లో అశ్లీలవీక్షణ వల్ల ఉత్పన్నమయ్యే మానసిక, భావోద్వేగ పరిస్థితుల మధ్య క్షణికావేశంలో కొన్నిసార్లు యువత చేస్తున్న దుశ్చర్యలు సమాజానికి మచ్చ కలిగిస్తున్నాయి. బడాబాబుల పిల్లలు చదివే ప్రైవేటు విద్యా సంస్థ లలో గుట్టుగా జరిగే మత్తు వినియోగంపై మౌనంగా ఉండే సమాజం నగరశివార్లలో రిసార్ట్‌లలో నడమంత్రపు సిరివంత యువత చేసే విచ్చలవిడి రాసలీలలను కూడ ఫ్యాషన్‌గా భావిస్తోంది. విద్యార్థులు తమ తమ పాఠశాలల వార్షికోత్సవ వేడుకలలో క్లబ్ డ్యాన్సుల తరహాలో చేస్తున్న నృత్యాలను, టీవీలలో ద్వంద్వార్థాలతో చేస్తున్న ప్రసారాలను వీక్షించి ఆనందించే ప్రజలు ఈ రకమైన వాతవారణంతో ప్రభావితమై మనిషి పశువుగా మారి ఒక అబలపై హత్యాచారం చేస్తే ఒక్కసారిగా అగ్రహావేశానికి లోనవుతోంది! సైదాబాద్‌లో చిన్నారి దుర్ఘటన సందర్భంగా కూడా ఇలాగే జరిగింది. ఎన్‌కౌంటర్ చేయాలని కోరింది. జొల్లు శివ, రాజు మొదలైన పేద నేరస్థులపై సమాజం కోపం ప్రదర్శిస్తోంది. గల్ఫ్‌లో పని చేసే వారి చిన్నారులపై స్వయాన బంధువులు పైశాచిక చర్యలకు పాల్పడితే కుటుంబ వ్యవహారమని విస్మరించిన ఇదే సమాజం, తాగిన మైకంలో ఔటర్ రోడ్డు ప్రమాదాలలో బడాబాబుల పిల్లలు మరణిస్తే పరామర్శకు పోటీపడుతోంది! ఈ నేపథ్యంలో సైదాబాద్ చిన్నారి దుర్ఘటన దేశంలోనే కాదు విదేశాలలోని భారతీయుల హృదయాలను కలచివేసింది. స్త్రీ సాధికారిత విషయంలో అరబ్ దేశాల పురోగతి ఏ రకంగా ఉన్నా మహిళల మాన ప్రాణ రక్షణ విషయంలో మాత్రం ప్రపంచంలో అగ్రభాగాన ఉన్నాయి. మహిళలపై అత్యాచారాలు లేదా లైంగికదాడులు ఇతర దేశాలతో పోల్చితే గల్ఫ్ దేశాలలో దాదాపు శూన్యమని చెప్పడంలో అతియోశక్తి లేదు. దుబాయి నగరంలో విచ్చలవిడిగా వ్యభిచారం జరుగుతుంది. పరస్పర ఆమోదంతో దొంగచాటు శృంగారం సాధారణమే కానీ ఒక మహిళ అభీష్టానికి వ్యతిరేకంగా లేదా ఆమెపై బలవంతంగా లైంగిక ఆత్యాచారం జరపడం అనేది మాత్రం అతి అరుదైన విషయం. గల్ఫ్ అంతటా క్షణికావేశంలో హత్యలు జరగడం మామూలే కానీ అత్యాచారం జరగడం అనేది మాత్రం దాదాపుగా అసంభవం. చట్టాల పదును సంగతిని పక్కన పెడితే, శీఘ్రగతిన నిష్పాక్షికంగా కేసుల విచారణ జరిపే వ్యవస్థల సామర్థ్యం వల్ల నిందితులు తప్పించుకోవడానికి అవకాశం లేకపోవడం నేరాల నియంత్రణకు ఒక ప్రధాన కారణమని చెప్పవచ్చు. పైగా బూటకపు లేదా అసత్య ఆరోపణలతో ఫిర్యాదు చేస్తే కూడ పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. కారణాలు ఏమైనప్పటికీ ఈ రకమైన పరిస్థితులు భారత్‌తో సహా అనేక ఇతర దేశాలలో లేవు. సౌదీ అరేబియాలో ఎలాంటి షీ టీంలు లేకున్నా ఒక మహిళ రాత్రిపూట తన విధులు ముగించుకుని ఒంటరిగా ఎటువంటి భయం లేకుండా ఇంటికి వెళ్ళగలుగుతుంది. ఖతర్లో సురక్షితంగా తన బిడ్డతో తిరిగినట్లుగా హైదరాబాద్‌లో తిరగడానికి ఒకింత వెనుకంజ వేస్తానని ఒక మిత్రురాలు చెప్పారు. దుబాయిలో పని చేసే ఒక మిత్రుడి కుమారుడు, బహ్రెయిన్‌లో ఇద్దరు మిత్రుల కుమార్తెలు పన్నెండవ తరగతి పూర్తి చేసుకున్నారు. ఈ ముగ్గురు కూడ పట్టభద్ర విద్యకై తమ పిల్లలను హైదరాబాద్‌కు పంపించాలని ఆరాటపడ్డారు. అయితే ఆ తర్వాత విరమించుకున్నారు. ఒకరు అయిష్టంగానైనా సరే, దుబాయిలోనే ఇంజినీరింగ్ చదివించడానికి మొగ్గు చూపగా మిగిలిన ఇద్దరు గత్యంతరం లేని పరిస్థితులలో తమ బిడ్డలను పాశ్చాత్యదేశాలకు పంపించారు. గల్ఫ్ దేశాలలో ఉన్నత విద్యావకాశాలకు పరిమిత అవకాశాలు ఉండడంతో ప్రతి సంవత్సరం అనేక మంది తమ పిల్లలను మాతృభూమికి పంపించడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు! ప్రభుత్వాల పుణ్యమా అంటూ విరివిగా లభించే మద్యానికి తోడుగా చౌక వైటర్ నుంచి ఖరీదైన మాదకద్రవ్యాల వినియోగం గూర్చి మాట్లాడానికి మన తెలుగు సమాజం ఇంకా సమాయత్తం కాలేదు. సంస్కృతి, ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే పంజాబ్ మాదకద్రవ్యాల గురించి మేల్కొనేసరికి చాలా ఆలస్యమయింది.

# 'బోస్ డీకే' చుట్టే ఏపీ రాజకీయాలు

విజయవాడ, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ లో ఎప్పటి నుంచో ఉన్న నేతలు ఇప్పుడు పార్టీలో పెద్దగా యాక్టివ్ గా లేరు. వారంతా వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామా? లేదా? అన్న ఆందోళనలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది నేతలు మినహా ఎవరూ పార్టీ కార్యక్రమాలకు ఖర్చు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఏ నియోజకవర్గంలో చూసినా ఇదే పరిస్థితి. దీంతో సీనియర్లు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్ట్రాటజీలను మార్చాలని చంద్రబాబును కోరుతున్నారు. వైసీపీ వ్యూహాల ముందు తేరుకోలేకపోతున్నామని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సానుభూతి కోసం చేసే యత్నాలు ఫలించడం లేదు. పట్టాభి వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ దాడులు చేసినా పెద్దగా ప్రజల నుంచి సింపతీని పొందలేకపోయారు. వైసీపీ పట్టాభి చేసిన వ్యాఖ్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. బోస్ డీకే అనే పదానికి అర్థాన్ని ముఖ్యమంత్రి జగన్ నుంచి ఎమ్మెల్యేల వరకూ ప్రజలకు వివరించారు. దీంతో పట్టాభి తప్పును బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కార్యాలయాలపై వైసీపీ కార్యకర్తలు దాడులు జరిగాయి. ఈ దాడులను జాతీయ మీడియా కూడా హైలెట్ చేసింది. దీంతో చంద్రబాబు దీనిని తనకు అనుకూలంగా మలచుకోవాలనుకున్నారు. వెంటనే బంద్ కు పిలుపు నిచ్చారు. దానికి విరుగుడుగా వైసీపీ నిరసన ప్రదర్శనలకు దిగింది. బంద్ పెద్దగా సక్సెస్ కాకపోవడంతో వెంటనే చంద్రబాబు 36 గంటల దీక్షకు దిగారు. దీనికి ప్రతిగా వైసీపీ కూడా జనాగ్రహ దీక్షలకు దిగింది. చంద్రబాబు వేసే ప్రతి అడుగును, వ్యూహాన్ని వైసీపీ అడుగడుగునా అడ్డుకుంటుంది. అదే సీనియర్ నేతలు ఇప్పుడు చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ ఆఫీస్ లపై జరిగిన దాడులు, పట్టాభి అరెస్ట్ ల కన్నా బోస్ డీకే అనే పదమే ఎక్కువగా ప్రజల్లోకి వెళ్లింది. ?ఇందులో వైసీపీ సక్సెస్ అయిందని, ఇలాంటి వ్యూహాలు మాని ప్రజల్లోకి వెళ్లడమే మంచిదని సీనియర్ నేతలు కొందరు చంద్రబాబుకు సూచించినట్లు తెలిసింది.

**టార్గెట్ లోకేష్**

ఆంధ్రప్రదేశ్ లో ప్రతి సంఘటన లోకేష్ ను ఇబ్బంది పెట్టేలా ఉంది. ఏ సంఘటన జరిగినా లోకేష్ టార్గెట్ అవుతున్నారు. ఆయన నాయకత్వాన్ని ఎద్దేవా చేస్తున్నారు. రాజకీయాలకు పనికిరానివాడిగా ముద్ర వేసే ప్రయత్నం జరుగుతుంది. అసలే లోకేష్ రాజకీయంగా ఇబ్బందుల్లో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై దాడులు సంఘటన కూడా లోకేష్ ను ఇరకాటంలోకి నెట్టేసింది. లోకేష్ నాయకత్వాన్ని అందరూ ప్రశ్నిస్తున్నారు. నారా లోకేష్ నాయకత్వంపై తెలుగుదేశం పార్టీలోనే అనుమానాలున్నాయి. చంద్రబాబు నాయకత్వాన్నే ఎక్కువ మంది పార్టీలో కోరుకుంటున్నారు. చంద్రబాబు తర్వాత టీడీపీని లోకేష్ నడపలేరని సొంత పార్టీ నేతలే అంతర్గత సమావేశాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ఇటీవల చంద్రబాబు కొంత తగ్గమని చెప్పినట్లుంది. కేవలం ట్విట్టర్ కే పరిమితమై ప్రభుత్వాన్ని విమర్శలు చేస్తూ వస్తున్నారు. వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యాలయంపై దాడులు జరిగినప్పుడు ఆయన ఆంధ్రప్రదేశ్ లో లేరు. హైదరాబాద్ లో ఉన్నారు. దీనిపై కూడా పార్టీలో కామెంట్స్ వినపడుతున్నాయి. చంద్రబాబు వయసు రీత్యా వారానికి ఒకసారి హైదరాబాద్ వెళ్లి వస్తున్నారని, లోకేష్ మాత్రం హైదరాబాద్ ను వదిలి రావడం లేదని పార్టీలో నేతలు అభిప్రాయపడుతున్నారు. లోకేష్ కనీసం నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు కూడా విన్పిస్తున్నాయి. మరోవైపు పవన్ కల్యాణ? దగ్గర కావడం కూడా నారా లోకేష్ నాయకత్వానికి ఇబ్బందిగా మారింది. పార్టీ నేతలు భవిష?యత్ లో తనకంటే పవన్ కల్యాణ్ కే ఎక్కువ ప్రయారిటీ ఇస్తారన్న భయం కూడా లోకేష్ లో లేకపోలేదంటున్నారు. తాను అన్ని విధాలుగా తయారైనా నాయకత్వం విషయం వచ్చేసరికి ప్రతి సంఘటనను లోకేష్ కు అన్వయిస్తున్నారు. లోకేష్ రాజకీయంగా ఎదగక పోవడం వల్లనే ఫ్రస్టేషన్ తో ఉన్నారని వైసీపీ నేతలు కామెంట్స్ చేయడం ఆయనకు ఇబ్బందికరంగా మారింది. మొత్తం మీద ఏపీలో ఏ సంఘటన జరిగినా అది లోకేష్ కు చుట్టుకుంటుంది.

## వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోరాటం చేస్తుంది.. మీలాగా రోజుకో పార్టీతో కాదు



వైఎస్సార్ కడప,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో ప్రజలు బీజేపీకి ఓటు వేసే పరిస్థితి లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. బద్వేలు ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బద్వేల్ నీటి సమస్యపై బహిరంగ చర్చకు సిద్ధం. టీడీపీ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో ట్యాంకర్లతో నీళ్లు తోలారు. మా ప్రభుత్వం వచ్చాక బ్రహ్మసాగర్ రిజర్వాయర్ ద్వారా సమృద్ధిగా నీరు అందిస్తున్నాం. బద్వేల్ అభివృద్ధి కోసం మా ప్రభుత్వం ఎప్పుడూ చిత్తశుద్ధితో ఉంది. బీజేపీకి ఓటు వేస్తే చెల్లని ఓటుగా మిగులుతుంది. వైఎస్సార్‌సీపీని విమర్శించడమే అజెండాగా బద్వేల్ ఎన్నికలను బీజేపీ వాడుకుంటోంది. కేంద్ర నిధులు అంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఉపఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో గెలిస్తే ఆరోపణలు చేసేందుకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోరాటం చేస్తుంది. మీలాగా రోజుకో పార్టీతో కాదు. టీడీపీ వాళ్లపై ఆధారపడి ఎన్నికల్లో ఉనికిని కాపాడుకొనేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. మరోవైపు చంద్రబాబు హైడ్రామా కొనసాగుతోంది. వ్యూహాత్మకంగా రాజకీయ కుట్రతో ముఖ్యమంత్రి ని తిట్టించడం.. గందరగోళం సృష్టించడం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా సీఎం జగన్ ఉండటాన్ని వారు భరించలేకపోతున్నారు. ఢిల్లీకి కాళ్ళు పట్టుకొని బ్రతిమాలడానికి వెళ్తున్నారా. అమిత్ షా ను కలిసి చంద్రబాబు ఏం చెప్తారు. తిరుపతిలో రాళ్లు వేసిన సంగతిని అమిత్ షాకు గుర్తు చేస్తారా..?. దేశంలో ఎక్కడలేని సంక్షేమ పథకాలు ఏపీలో అమలవుతున్నాయి. ఎన్నికల కోడ్ వల్ల బద్వేల్ అభివృద్ధి తాత్కాలికంగా ఆగిపోయింది. బద్వేలు ఉప ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుంది' అని కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు.

# జెఎన్టీయూలో నకిలీ డాక్టరేట్లు..!





కాకినాడ, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో నకిలీ పీహెచ్‌డీలతో విద్యాబోధన యథేచ్ఛగా కొనసాగుతున్నా.. చర్యలు తీసుకోవాల్సిన వర్సిటీల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేఎన్‌టీయూ (కాకినాడ) వర్సిటీ ఏపీలోని 8 జిల్లాల్లో విస్తరించి ఉంది. దీని పరిధిలో 180 అఫిలియేటెడ్ ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. ఒక్కో కళాశాలలో ఒకరిద్దరు చొప్పున ఎనిమిది జిల్లాల్లో సుమారు 200 మంది నకిలీ పీహెచ్‌డీ సర్టిఫికెట్లతో విద్యాబోధన చేస్తున్నట్లు తేటతెల్లమయ్యింది. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నిబంధనల మేరకు అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ స్థాయిలో బోధించాలంటే పీహెచ్‌డీ తప్పనిసరి. గుర్తింపు పొందిన వర్సిటీల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థిని కళాశాలల్లో నియమిస్తే నెలకు రూ.90,000 నుంచి రూ.1,20,000 వరకు వేతనం ఇవ్వాలి. ఇంత మొత్తం ఇవ్వడం ఇష్టం లేని ప్రైవేట్ యాజమాన్యాలు తక్కువ జీతానికి వచ్చే ఫేక్ పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.40 వేల వరకు ఇస్తూ పబ్బం గడుపుకుంటున్నాయి. కొంతమంది అభ్యర్థులు కర్నాటక, తమిళనాడు, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని కొన్ని వర్సిటీలకు ఎంతో కొంత సమర్పించుకుని నకిలీ పీహెచ్‌డీ పట్టా తెచ్చుకుంటున్నారు. తక్కువ జీతానికే పనిచేస్తామని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను ఆశ్రయిస్తున్నారు. వారు సైతం ఖర్చు తక్కువ అవుతుందని భావించి.. అతి తక్కువ జీతాలిస్తూ వీరిని ప్రోత్సహిస్తున్నారు. కీలక ఉద్యోగాల్లో నియమిస్తున్నారు. అనుభవం లేని నకిలీ అధ్యాపకులు పాఠాలు బోధిస్తుండడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎడారిలో ఎండమావిలా మారింది. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో యూనివర్సిటీ అధికారులు ప్రతి ఏటా నిజ నిర్ధారణ కమిటీల పేరుతో తనిఖీలు నిర్వహిస్తున్నా.. నకిలీ పీహెచ్‌డీలపై దృష్టి సారించడం లేదు. యాజమాన్యాలు ఇచ్చే ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో నకిలీ పీహెచ్‌డీ సర్టిఫికెట్లతో వివిధ హోదాల్లో కొనసాగుతున్న వారి జాబితా చాంతాడంత ఉంది. ఏలూరు, తాడేపల్లిగూడెం, కాకినాడ, కృష్ణాజిల్లా చల్లపల్లి, గుంటూరు, నర్సాపురంలోని కొన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇదే తంతు సాగుతోంది. దాదాపు 200 మంది వివిధ హోదాల్లో నకిలీ సర్టిఫికెట్లతో కొనసాగుతున్నారని తెలుస్తోంది. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనలు తప్పకుండా పాటించాలి. నకిలీ పీహెచ్‌డీ సర్టిఫికెట్లతో కళాశాలల్లో పనిచేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే నిజనిర్ధారణ కమిటీలు తనిఖీ సైతం నిర్వహించాయి. నకిలీ పీహెచ్‌డీ అభ్యర్థులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో కొన్ని యూనివర్సిటీలు పీహెచ్‌డీ పూర్తి చేసిన వారి డేటా వర్సిటీ వెబ్‌సైట్‌లలో ఉంచుతున్నారు. మిగతా యూనివర్సిటీలు కూడా పాటిస్తే పారదర్శకత పెరుగుతుంది.

# మారుతున్న ఆహార అలవాట్లు



కర్నూలు, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: ఇద్దరికీ షుగర్ సాధారణ స్థితికి రావడంతో వైద్యులు ఆ రిపోర్ట్‌లు పరిశీలించి మందుల డోసు తగ్గించాడు. షుగర్ నియంత్రణలోకి రాకపోవడంతో ఆహారంలో సిరిధ్యానాలు చేర్చుకున్నాడు. మూడురోజులకు ఒక సిరిధాన్యాన్ని మార్చి మార్చి వివిధ వంటకాలు తయారు చేయించుకుని తినసాగాడు. కొన్ని రోజులకే అతని షుగర్ నియంత్రణలోకి వచ్చేసింది. వీరే కాదు జిల్లాలో అనేక మంది మెనూలో అన్నాన్ని తగ్గించడమో లేదా పూర్తిగా మానేయడమో చేస్తున్నారు. కాఫీ, టీలు తాగినా చక్కెర లేకుండా తాగుతున్నారు. తమ అలవాట్లలోనూ మార్పులు చేసుకుంటున్నారు. పాతకాలం నాటి ఆహార పద్ధతులైన కొర్రలు, సజ్జలు, రాగులు, సామలు, గోదుమలతో చేసిన వంటకాలను తినేందుకు ఇష్టపడుతున్నారు. జీవనశైలిలో మార్పుల వల్ల వచ్చిన జబ్బులకు ఆహారంలో మార్పులే విరుగుడని ప్రజలు భావించి ప్లేట్‌లో మెనూనే మార్చుకుంటున్నారు. బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, ఊబకాయం, గ్యాస్ట్రబుల్, గుండెజబ్బులు వంటివన్నీ జీవనశైలిలో మార్పుల వల్ల వచ్చే జబ్బులే. జిల్లా జనాభా 45లక్షలకుపైగానే ఉంది. ఇందులో 20శాతం ప్రజలు బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి జీవనశైలి జబ్బులతో బాధపడుతున్నారు. తలనొప్పి, కళ్లు తిరగడం, ఒళ్లునొప్పులు, నీరసం, మూత్రం ఎక్కువసార్లు వెళ్లడం వంటి లక్షణాలుండి వైద్యుల వద్దకు వెళ్లే ప్రతి ముగ్గురిలో ఇద్దరికి బీపీ, షుగర్ ఉన్నట్లు నిర్ధారిస్తున్నారు. విజ్ఞతగల వైద్యులు ముందుగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. అప్పటికీ వారిలో మార్పు రాకపోతే మందులకు వెళ్తున్నారు. కానీ జిహ్వాచాపల్యాన్ని చంపుకోలేని వారు మందులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఫలితంగా ప్రతి సంవత్సరం వారు వాడే మందుల డోసు పెరుగుతుందే గానీ వ్యాధి నయం కావడం లేదు. దీనికంతటికీ విరుగుడు మళ్లీ పాత రోజుల్లోని ఆహారపు అలవాట్లకు వెళ్లాల్సిందేనని అధిక శాతం భావిస్తున్నారు. ఈ మేరకు వారు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. ఇటీవల కాలంలో కర్నూలుతో పాటు నంద్యాల, ఆదోని లాంటి పట్టణ ప్రాంతాల్లో సాయంత్రం కాగానే జొన్నరొట్టెలు, పుల్కాలు, చపాతీలు, కర్రీలు విక్రయించే వ్యాపార కేంద్రాలు తెరుచకుంటున్నాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు అక్కడ జొన్నరొట్టెలు కొడుతూనే ఉంటారు. వేడివేడిగా రొట్టెలు ఇలా వస్తానే అలా విక్రయాలు జరిగిపోతున్నాయి. కర్నూలులోని గాంధినగర్, వెంకటరమణ కాలని, నరసింహారెడ్డి నగర్, రైల్వేస్టేషన్ రోడ్, అశోక్‌నగర్, మద్దూర్‌నగర్, నంద్యాల రోడ్డు, గణేష్‌నగర్, సి.క్యాంపు, నాగిరెడ్డి రెవిన్యూ కాలని, బుధవారపేట, శ్రీరామనగర్ ఇలా దాదాపు అన్ని కాలనీల్లో రొట్టెలు విక్రయించే దుకాణాలు విస్తృతంగా వెలిశాయి. ఒక జొన్న రొట్టె, చపాతీలు ఒక్కోటి రూ.12ల నుంచి రూ.15ల వరకు విక్రయిస్తున్నారు. వీటిలోకి కర్రీలు కావాలంటే అదనంగా రూ.10 నుంచి రూ.15లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యాపారులు తక్కువ సమయంలో లాభార్జన చేసేందుకుగాను జొన్న పిండిలో బియ్యం పిండి కలిపి రొట్టెలు చేస్తున్నారు. దీనివల్ల ప్రజలు తమ ఆహారాన్ని మార్చుకున్నా ఉపయోగం ఉండటం లేదు. ప్రజల ఆహారపు అలవాట్లు మారడంతో రెస్టారెంట్లలోనూ మెనూలో మార్పులు తీసుకొచ్చారు. నగరంలో 30కి పైగా చిన్నా, పెద్దా రెస్టారెంట్లు ఉన్నాయి. ఇందులో అధిక శాతం తందూరి రోటీ, చపాతి, పుల్కాలు, జొన్న రొట్టెలు ఆర్డర్ ఇస్తున్నారు. అందులో ఏదో ఒక కర్రీని ఆహారంగా తీసుకుంటున్నారు. చివరగా ఒక బిర్యానిని ముగ్గురు కలిసి ఆర్డర్ ఇచ్చి తింటున్నారు. గతంలో ఒక్కో బిర్యానిని ఒక్కొక్కరు తినేవారు. ఇప్పుడు బిర్యాని స్థానంలో రొట్టెలు వచ్చి చేరాయి. దీంతో పాటు రెస్టారెంట్లలో రాగి ముద్ద, రాగిసంకటి, కొర్ర అన్నం కూడా వండి పెడుతున్నారు. ఐదురోడ్ల కూడలిలో కేవలం సిరిధాన్యాలతో వండిన ఆహారపదార్థాలను విక్రయించడం విశేషం. జీవనశైలి వ్యాధులకు సిరిదాన్యాలే మందు అని ఇటీవల పలు సామాజిక మాధ్యమాల్లో సమాచారం చక్కర్లు కొడుతోంది. దీంతో ప్రజలు కొర్రలు, సామలు, అరికెలు, సజ్జలు కొనేందుకు ముందుకు వస్తున్నారు. 40 ఏళ్ల క్రితం ఇవి పేదల ఆహారంగా ఉండేవి. అప్పట్లో ధనవంతులు మాత్రమే వరి అన్నాన్ని భుజించేవారు. ఈ కారణంగా అప్పట్లో బీపీ, షుగర్ జబ్బులు అధిక శాతం ధనవంతులకు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు వరి అన్నం అందరికీ అందుబాటులోకి రావడంతో 30 ఏళ్లుగా ఇదే ప్రధాన ఆహారంగా మారింది. అయితే వరిదాన్యాన్ని తెల్లగా పాలిష్ పట్టడంతో దానిపై ఉన్న పోషకాలు పోయి పిప్పిగా మారుతోంది. దీన్ని వండుకుని తినడంతో నేరుగా గ్లూకోజ్ మన శరీరంలోకి వెళ్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ కారణంగా ఇప్పుడు ఆహారంపై అవగాహన పెంచుకుని అలవాట్లను మార్చుకుం టున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్నలు(రాయచూరు) రూ.55లు, కొర్రలు రూ.60లు, సామలు, అరికెలు రూ.80లకు పైగానే విక్రయిస్తున్నారు. ఇక సేంద్రీయ ఎరువులతో పండించిన సిరిదాన్యాలు కిలో రూ.110లకు పైగానే పలుకుతున్నాయి. గతంలో వీటిని కొనేవారు లేక పశువులకు పెట్టేవారంటే అతిశయోక్తి కాదు.

# 40 నెలల తర్వాత షా దగ్గరకి...



విజయవాడ, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు ఇన్నాళ్లకు అవకాశం దక్కింది. దాదాపు నలభై నెలల తర్వాత నలభై ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళుతున్నారు. శనివారం ఆయన ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంమంత్రిని అమిత్ షాను కలవనున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలపై చంద్రబాబు అమిత్ షాకు వివరించనున్నారు. అమిత్ షాతో పాటు వీలయితే రాష్ట్రపతిని కూడా కలిసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఢిల్లీకి వెళ్లారు. అదీ మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. దీంతో పాటు టెన్ జన్ పథ్ ను కూడా చంద్రబాబు సందర్శించారు. రాహుల్ గాంధీని కలిసి మోదీకి వ్యతిరేకం? పోరాడాలని పిలుపు నిచ్చారు కూడా. ఢిల్లీలో దీక్షలకు దిగి మోదీ ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టారు. అయితే 2019 ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబు తన తప్పును ఒప్పుకున్నారు. మోదీతో కలసి పనిచేస్తానని చెప్పుకున్నారు. అయితే చంద్రబాబు గత మూడేళ్ల నుంచి ఢిల్లీ గడప తొక్కలేదు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తో జట్టుకట్టిన చంద్రబాబు ఆ తర్వాత దాని ఊసే మరిచారు. బీజేపీతో తిరిగి ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆయన కొద్దిరోజులుగా అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ స్థానిక బీజేపీ నేతల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ప్లాన్ అమలు కాలేదు. అయితే ఇప్పుడు పార్టీలో అగ్రనేత అమిత్ షాను కలిసే అవకాశం దక్కింది. ఇటీవల కాలంలో చంద్రబాబుకు మోదీకి లేఖలు రాయడం కూడా ఎక్కువయింది. బీసీ జనగణన, బోయకులాన్ని ఎస్టీలో చేర్చాలంటూ మోదీకి లేఖలు రాస్తున్నారు. తన ఇంటిపై వైసీపీ ఎమ్మెల్యే దాడికి వచ్చినా పెద్దగా పట్టించుకోని చంద్రబాబు రాష్ట్ర పార్టీ కార్యాలయంపై దాడిని జాతీయ మీడియాలో హైలెట్ అయ్యేలా చూడగలిగారు. ఢిల్లీకి దారి వెతుక్కునేందుకు ఈ ఘటన ఉపయోగపడింది. చంద్రబాబు అమిత్ షా ను కలసి ఇటు జగన్ ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడంతో పాటు సమ్మతిస్తే తాను కలసి నడవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పడానికి కూడా చంద్రబాబుకు అవకాశం దక్కింది.

# కర్ణాటక నీటి దోపిడి



బెంగళూర్, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం. దీని నుంచి జల చౌర్యానికి అలవాటు పడిన కర్ణాటక ఇబ్బడిముబ్బడిగా ఎత్తిపోతల పథకాలు, భారీ మోటార్లతో నీటి దోపిడీకి పాల్పడుతోంది. ఉమ్మడి రాష్ట్రాల ప్రాజెక్టుగా ఉన్నటువంటి తుంగభద్ర (టీబీ) డ్యాం నీటిని కేటాయించిన మేరకు అందించేందుకు బోర్డున్నా కూడా జల దోపిడీని అరికట్టలేకపోతోంది. ప్రాజెక్టు తమ భూభాగంలో ఉందనే ధీమాతో డ్యాం ఎగువన, దిగువన, నది పరీవాహక ప్రాంతాల్లో నుంచి ఇష్టానుసారంగా కర్ణాటక నీటిని దోపిడీ చేస్తోంది. ఈ దోపిడీపై గతేడాది అక్టోబర్ 22న టీబీ బోర్డు సమావేశంలో ఉమ్మడిగా తనిఖీలు చేయాలని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఇంజనీర్లు చేసిన సూచన మేరకు జాయింట్ కమిటీ ఏర్పాటుచేశారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 2 వరకు జాయింట్ కమిటీ తనిఖీలు నిర్వహించింది. ఈ కమిటీ విచారణలో కన్నడిగుల గుట్టురట్టు అయ్యింది. దీంతో కమిటీ ఇచ్చిన నివేదికను ఈ నెల 29న బెంగళూరులో జరుగనున్న టీబీ బోర్డు సమావేశంలో ప్రధాన అజెండాగా ప్రవేశ పెట్టనున్నారు. సమావేశంలో దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంది. తుంగభద్ర డ్యాం నీటిని దొంగచాటుగా కాజేసేందుకు టీబీ డ్యాం కుడి, ఎడమ వైపున మొత్తం 50 ఎత్తిపోతల పథకాలు ఉన్నట్లు జాయింట్ కమిటీ గుర్తించింది. ఇందులో కుడి వైపు 28, ఎడమ వైపు 22 ఉన్నాయి.

# జలజగడాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు..?

రెండు తెలుగు రాష్ట్రాల నేతల మధ్య జలవివాదం ఇబ్బందికరంగా మారనుంది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఖచ్చితంగా రాష్ట్రం కోసం ఇద్దరూ నేతలు పోరాడాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించారు. ఏపీ ప్రభుత్వం వ్యవహారశైలి వల్లనే ప్రాజెక్టులు కేంద్రం పర్యవేక్షణలోకి వెళ్లాయని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో ఏపీకి నష్టం చేయాలన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నారని ఏపీ ముఖ్యమంత్రి జగన్ భావిస్తున్నారు. ఇవి పైకి కనపడుతున్నాయి. కానీ ఎన్నికలకు ముందు ఇద్దరూ పరోక్షంగా ఒకరికి ఒకరు సహకరించుకుంటారన్న టాక్ రెండు పార్టీల్లో వినపడుతుంది. తెలంగాణలో 2023లో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో కేసీఆర్ కు జగన్ సహకారం ఎంతో అవసరం. తాను తెలంగాణలో పార్టీని మూసేశామని ఇప్పటికే వైసీ?పీ నేతలు ప్రకటించారు. అయితే వైఎస్ షర్మిల పార్టీ పెట్టారు. అయినా కూడా ఎంతమాత్రం సహకరించకూడదని నిర్ణయించారు. ఇది పరోక్షంగా కేసీఆర్ కు సహకరించినట్లేనని అంటున్నారు. వైఎస్ షర్మిల కేసీఆర్, కేటీఆర్ ఆయనప్రభుత్వాన్ని ఎన్ని విమర్శలు చేస్తున్నా టీఆర్ఎస్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆమెను లైట్ గానే తీసుకుంటున్నారు. కేసీఆర్ మూడోసారి విజయం సాధించాలంటే పరోక్షంగా జగన్ సహకారం అవసరం ఉంటుంది. చంద్రబాబు ఎటూ ఏదో ఒక పార్టీతో కలిసి తనను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తాడని కేసీఆర్ కు తెలుసు. అందుకే జగన్ తో రాజకీయంగా సఖ్యతనే కోరుకుంటారు. ష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం జారీచేసిన గెజిట్ అమలుపై కొనసాగుతున్న ప్రతిష్ఠంభనపై కేంద్రం దృష్టిసారించినట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో కేంద్ర జల్ శక్తి మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ రెండు బోర్డులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ నెల 14వ తేదీ నుంచి గెజిట్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఏపీ, తెలంగాణ పరిధిలో కృష్ణా నదిపై శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల కింద 15 అవుట్‌లెట్లు, గోదావరి పరీవాహకంలోని పెద్దవాగు ప్రాజెక్టులను మొదటి దశలో అప్పగించాలనే అంశంపై బోర్డులు తీర్మానాలు చేశాయి. వీటిపై రెండు రాష్ట్రాలు ఉత్తర్వులు (జీవో) జారీచేయాల్సి ఉంది. కృష్ణా ప్రాజెక్టులకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది. బోర్డుల సమావేశాల్లో ప్రతిపాదనలపై తీర్మానాలను ఆమోదించాక కూడా వాటి అమలులో జరుగుతున్న జాప్యం, అవరోధాలను తొలగించడమే ధ్యేయంగా జల్‌శక్తిశాఖ బోర్డులతో ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధాన ప్రాజెక్టు అమలుపై రాష్ట్రాల అభిప్రాయాలు కోరనున్న నేపథ్యంలో రాష్ట్ర అవసరాలు, హక్కులను వినిపించేందుకు తెలంగాణ నీటిపారుదల శాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 28వ తేదీన కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆన్‌లైన్‌లో సంబంధిత రాష్ట్రాల సీఎంలతో ఈ విషయమై మాట్లాడనున్నారు. 29వ తేదీన హైదరాబాద్‌లో తొమ్మిది రాష్ట్రాల నీటిపారుదల శాఖలతో జల్‌శక్తిశాఖ సహాయ మంత్రి సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి బేసిన్‌లో ఇప్పుడున్న నీటి వినియోగం ఎంత? నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర అవసరాలు ఏ మేరకు ఉంటాయి? తదితర అంశాలు కేంద్రానికి వివరించేలా తెలంగాణ అంతరాష్ట్ర జల వనరుల విభాగం ఓ ప్రజంటేషన్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ మేరకు బుధవారం నిర్వహించిన సమావేశంలో దీనిపై చర్చించినట్లు కూడా తెలిసింది. గోదావరి, కృష్ణా పరీవాహకంలో నీటి అవసరాలు, కేటాయింపులు, ట్రైబ్యునళ్లలో కొనసాగుతున్న వ్యాజ్యాలు తదితర అంశాలనూ కేంద్రం ముందు పెట్టేందుకు నీటిపారుదల శాఖ సిద్ధమవుతోంది. ఇక ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సమయంలోనూ పరోక్షం గా జగన్ కు కేసీఆర్ సహకారం అవసరం. కేసీఆర్ ప్రభావం ఏపీలో కొంత ఉండే అవకాశముంది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇద్దరూ యుద్ధమే చేస్తున్నా, రాజకీయాలకు వచ్చేసరికి కేసీఆర్, జగన్ లు ఒక్కటవుతారన్నది వాస్తవం. ఇద్దరి ఉమ్మడి శత్రువు చంద్రబాబు కాబట్టి వచ్చే ఎన్నికలకు ఇద్దరూ పరోక్షంగా ఒకరికొకరు సహకరించుకోనున్నారు.



## ఖాదర్ భాష ను టైలర్స్ అసోసియేషన్ పరామర్శ...

బిట్రగుంట అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి :కావలి టైలర్స్ అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సేవ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు,ఖాదరుబాష ఇటీవల డిస్క్ ఆపరేషన్ జరిగి విశ్రాంతి తీసుకొంటున్న సందర్భముగా,బాష నివాసమునకు వెళ్లి పరామశించి,ఆరోగ్యం గురించి ఆత్మీయము పలుకరించరు కావాలి టైలర్స్ అసోసియేషన్ సభ్యులు, మరియు త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యవంతు లై అన్ని స్వచ్చేంద కార్యక్రమములలో పాల్గొనాలని,మీకు శక్తీ,యుక్తి ఆభగవంతుడు మీకీవ్వాలని,మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని అన్నారు పై కార్యక్రమములో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు,ఎం .రమేష్,సెక్రటరీ,ఎస్ కే.రహీమాన్,గౌరవ అధ్యక్షులు,పెంచలయ్య,వైస్ ప్రెసిడెంట్ మాల్యాద్రి, గౌరవ సలహా దారుడు రఫీ ఈసీ మెంబర్స్,అమరజ్యోతి,దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# హస్తినకు చేరిన పంచాయితీ

న్యూఢిల్లీ,అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: టీడీపీ-వైసీపీ పోటాపోటీ దీక్షలు-నిరసనలు. ఇప్పటి వరకు ఒక లెక్క! ఇకపై మరో లెక్క! వార్ నెక్స్ట్ లెవల్‌కి చేరింది. సీన్ ఢిల్లీకి మారనుంది. హస్తిన వీధుల్లో తేల్చుకునేందుకు ఆ రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. అటు రాజ్‌భవన్ గడప కూడా తొక్కారు టీడీపీ నేతలు..ఏపీలో ప్రజెంట్ పొలిటికల్ సిట్యుయేషన్ తగ్గేదేలే..అన్నట్లు సాగుతోంది. ఏపీ రచ్చ ఇక ఢిల్లీకి చేరనుంది. రాష్ట్రంలో పోటాపోటీ దీక్షలు, నిరసనలతో హోరెత్తిస్తున్న టీడీపీ-వైసీపీ ఇప్పుడు హస్తినమే సవాల్ అంటున్నాయి. ఢిల్లీ వేదికగా బలప్రదర్శనకు రెడీ అవుతున్నాయి. దీక్ష ముగిసిన వెంటనే దేశ రాజధానికి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు చంద్రబాబు. హోంమంత్రి అమిత్‌షాను కలిసి రాష్ట్రంలో పరిస్థితిని వివరించాలని భావిస్తున్నారు. అటు వైసీపీ నేతలు కూడా హస్తిన యాత్రకు సై అంటున్నారు.. అమిత్‌షాతోపాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు ప్లాన్ చేస్తున్నారు. టీడీపీ గుర్తింపు రద్దు చేయాలని కోరనున్నారు. అటు టీడీపీ ఆఫీసులపై జరిగిన దాడి ఘటనను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు టీడీపీ నేతలు. రాష్ట్రపతి పాలన విధించడంతోపాటు..అఃఎ విచారణ జరపించాలని కోరారు.అటు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు జనాగ్రహ దీక్షలు చేపట్టారు. సీఎం జగన్‌పై టీడీపీ లీడర్స్ చేస్తోన్న బూతు కామెంట్స్‌కు నిరసన తెలుపుతున్నారు. మంత్రి అవంతి శ్రీనివాస్ తన సొంత నియోజకవర్గం భీమిలిలో దీక్ష చేపట్టారు. బూతులు తిట్టించడం, రెచ్చగొట్టడం? ఇదేనా నీ 40 ఇయర్స్ ఇండస్ట్రీ అనుభవం అంటూ చంద్రబాబుపై నిప్పులు చెరిగారు.నగరి ఎమ్మెల్యే రోజా పుత్తూరులో నిరసన ప్రదర్శ చేపట్టారు. చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.వైసీపీ జనాగ్రహ దీక్షల్లో వింతైన దృశ్యాలు కూడా కనిపించాయ్. నిరసన ప్రదర్శనల్లో ఎవరైనా ఏం చేస్తారు? ర్యాలీ చేస్తారు? నినాదాలు చేస్తారు. మహా అయితే దిష్టిబొమ్మ దగ్ధం చేస్తారు? కానీ, వైసీపీ కార్యకర్తలు అంతకు మించి అన్నట్టు చేస్తున్నారు. రాజమండ్రిలో ఎంపీ భరత్ జనాగ్రహ ర్యాలీ చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్‌పై టీడీపీ లీడర్లు చేసిన బూతు కామెంట్స్‌పై తమ నిరసన తెలిపారు. అంతవరకు బాగానే ఉంది. కానీ, అసలు సీన్ ఇక్కడే మొదలైంది. చంద్రబాబుపై తమకున్న కోపాన్ని వెరైటీగా చూపించారు. సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోనూ వైసీపీ నేతలు జనాగ్రహ దీక్షలు చేపట్టారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దగ్గర దీక్షలో కూర్చున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై టీడీపీ నేతలు చేసిన బూతు కామెంట్స్‌పై నిరసన తెలుపుతున్నారు.

# చిన్నమ్మకు బ్యాక్ ఎవరు..?



చెన్నై, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: దివంగత సీఎం జయలలిత మరణం తర్వాత తమిళనాడు రాజకీయాల్లో ముసలం మొదలైంది. అన్నాడీఎంకేలో మొదలైన ఆధిపత్య పోరు ప్రత్యర్థి పార్టీలకు వరంగా మారగా సొంతపార్టీకి శాపంగా మారింది. పన్నీర్ సెల్వం, పళనిస్వామి వర్గాలుగా విడిపోవడంతో కిందటి ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటమిపాలైంది. డీఎంకే అధికారంలోకి రావడానికి అన్నాడీఎంకేలోని లుకలుకలే ప్రధాన కారణమని ఆపార్టీ నేతలు చెబుతుండటం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో అన్నాడీఎంకేను తాను దారిలో పెడుతానని 'చిన్నమ్మ' ప్రకటించుకోవడం విశేషం.జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకే పార్టీ కార్యక్రమాలను శశికళ చూసుకునేవారు. ఒకనొక సమయంలో ఆమె సీఎం అభ్యర్థిగా ప్రకటించబడ్డారు. అయితే అనుహ్య పరిణామాల నేపథ్యంలో శశికళ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కొన్నినెలలు జైలు శిక్ష అనుభవించిన తర్వాత ఆమె విడుదలయ్యారు. ఈ సమయంలోనే తాను రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు ప్రకటించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటమి పాలయ్యాక ఆమె అవసరాన్ని అన్నాడీఎంకే గుర్తించినట్లు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే శశికళ రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చారు.శశికళ వచ్చి రావడంతోనే తానే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శినని ప్రకటించుకున్నారు. ఆమెకు పన్నీర్ సెల్వం మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మరో నాలుగేళ్ల వరకు తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలేవు. దీంతో ఆమె ఇప్పటికిప్పుడు అన్నాడీఎంకేను ఉద్ధరించాల్సిన అవసరం లేదనే టాక్ విన్పిస్తోంది. అయినా సరే పార్టీని తమ గ్రిప్ లోకి తెచ్చుకునే ప్రయత్నం శశికళ చేస్తుండగా బీజేపీకి తొలి నుంచి మద్దతు ఇస్తున్న పన్నీర్ సెల్వం ఆమెకు అండగా నిలుస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే బీజేపీ శశికళను రంగంలోకి దింపిందనే టాక్ తమిళనాడులో విన్పిస్తోంది.దక్షిణాదిలో బీజేపీకి కర్ణాటక మినహా ఎక్కడ సరైన బలం లేదు. జయలలిత సీఎంగా ఉన్న సమయంలో తమిళనాడులో బీజేపీని పక్కనపెట్టారు. ఆమె మరణం తర్వాత బీజేపీకి అక్కడ పట్టు దొరికింది. పన్నీర్ సెల్వంను మచ్చిక చేసుకొని అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంది. అయితే అన్నాడీఎంకేలో నేతల మధ్య అధిపత్య పోరు కారణంగా ఆపార్టీ కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. ఈ ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై పడకుండా బీజేపీ ముందస్తు ప్లాన్ చేస్తోంది.ప్రస్తుతం అధికారంలోకి ఉన్న డీఎంకే బీజేపీకి మద్దతు ఇచ్చే అవకాశం లేదు. ఆపార్టీ కాంగ్రెస్ తో కలిసి నడుస్తోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో డీఎంకే ఎక్కువ స్థానాలు సాధిస్తే బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే పన్నీర్ సెల్వం మద్దతుతో శశికళను బీజేపీ తిరిగి అన్నాడీఎంలోకి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. పన్నీర్ సెల్వం పార్టీని నిలబట్టే కంటే పళనీస్వామిని దెబ్బతిసేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతోనే ఆయన శశికళకు మద్దతు ఇస్తున్నట్లు కన్పిస్తోంది. అయితే ఇదంతా కూడా పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ వేసిన స్కెచ్ లో భాగమనేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టేందుకే...

డబ్బు లోటు ఎదుర్కొంటున్న కేంద్ర ప్రభుత్వం... రెడీమేడ్‌గా ఉన్న ఆస్తుల లీజు ద్వారా... రూ.6 లక్షల కోట్లు ఆర్జించే జాతీయ నగదీకరణ పథకాన్ని ప్రకటించింది. ప్రధాన మంత్రి ప్రకటించిన 5 సంవత్సరాల మౌలిక సౌకర్యాల అభివృద్ధి ప్రణాళికకు అవసరమైన రూ. 111 లక్షల కోట్లలో లీజు ద్వారా వచ్చే రూ. 6 లక్షల కోట్లు (5.4 శాతం) ఒక భాగం. ఇది అతిస్వల్పం. రూ. 111 లక్షల కోట్లలో కేంద్ర వాటా 39 శాతం. ఈ పథకంలోకి రాష్ట్ర ప్రభుత్వాలను కూడా లాగుతారు. 12 కేంద్ర మంత్రిత్వ శాఖల కింద విస్తరించిన 20 రకాల ఆస్తులను ఈ ప్రణాళికలో భాగం చేశారు.

### ఆస్తుల లీజు లక్ష్యాలు

ఆస్తుల నగదీకరణను ప్రతిపక్ష పార్టీలు చట్టపర దోపిడీగా, ప్రమాదకర చర్యగా పేర్కొన్నాయి. అమూల్యమైన ఆస్తులను దశాబ్దాల తరబడి కారుచౌకగా ప్రైవేట్ చేతుల్లో పెట్టటాన్ని వ్యతిరేకిస్తున్నాయి. కానీ ఈ విమర్శలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తిరస్కరించారు. ప్రభుత్వ యాజమాన్యాన్ని బదిలీ చేయటం లేదని, లీజు ద్వారా వచ్చే డబ్బులను మౌలిక సౌకర్యాల నిర్మాణంలో పెట్టుబడులుగా పెడతామంటున్నారు. పూర్తిగా నిర్మించి నిరుపయోగంగా పడిఉన్న లేదా తక్కువ ఉపయోగంలో ఉన్న ఆస్తులను లీజుకు ఇస్తామని ఆర్థికమంత్రి చెప్పారు. ఇలా చెప్పటం ద్వారా తమ ప్రభుత్వ అసమర్ధతను బయట పెట్టారు. నిరుపయోగంగా ఉన్న ఆస్తులను పెట్టుబడిదారులు ఎందుకు తీసుకుంటారనే మరో ప్రశ్న ఉదయిస్తుంది.ఈ భారీ అమ్మకాలకు పాల్పడటం మోడీ ప్రభుత్వ ఘోర వైఫల్యాన్ని సూచిస్తుంది. ధనవంతుల మీద, కార్పొరేట్ కంపెనీల మీద పన్ను వేయటంలో, పన్నుల ఎగవేతను అరికట్టడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. పైగా మౌలిక సౌకర్యాల ఆస్తులను లీజుకి తీసుకునే పెట్టుబడిదారులు ప్రజలకు సేవ చేయటానికి తీసుకోవటం లేదనే అంశాన్ని ప్రభుత్వం దాచిపెడుతోంది. బడా కార్పొరేట్ సంస్థలకు అతి చౌక రేట్ల మీద ఈ ఆస్తులను అప్పజెప్పటానికి వాటి విలువను కావాలనే తక్కువ చేసి చూపిస్తున్నది.

ఆస్తుల నగదీకరణ కార్యక్రమం వలన ఉద్యోగ అవకాశాలు వస్తాయని సీతారామన్ చెప్పారు. అధిక ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్నారు. ఉద్యోగాలు సృష్టించటం, ఆర్థికాభివృద్ధి జరగటం ఎలా సాధ్యమనేది ప్రశ్న. తమ లీజు కాలంలో పని గంటలు పెంచి, కార్మికులను లేదా వేతనాలను తగ్గించి పెట్టుబడిదారులు అత్యధిక లాభాలను గడిస్తారు. సహజంగా పెట్టుబడిదారులు తమ సేవల చార్జీలు పెంచుతారు. పోటీని అదుపు చేస్తారు. సేవల నిర్వహణా వ్యయాన్ని తగ్గిస్తారు. పర్మినెంట్ ఉద్యోగాలు ఉండవు. లీజు తుది దశలో నిర్వహణను పట్టించుకోరు. ఆస్తులు పాడయిపోయిన స్థితిలో ప్రభుత్వానికి స్వాధీనం చేస్తారు. అపుడు ప్రభుత్వం లీజు కాలాన్ని పెంచాలి. లేదా వారికి అమ్మాలి.


### ఇతర దేశాల అనుభవాలు

ధనిక దేశాలలో ప్రజారంజక ప్రభుత్వాలు తిరిగి ఏర్పడుతుండగా, భారతదేశం తిరోగమనంలోకి పోతోంది. ప్రజారంజక ప్రభుత్వాల కాలం తీరటాన్ని ప్రజలు చూస్తున్నారు. బ్రిటన్‌లో రైల్వే రంగాన్ని తిరిగి జాతీయం చేస్తామని ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రకటించారు. ముక్కలు కావటానికి, గందరగోళానికి, అధిక సంక్లిష్టతకు దారితీసిన 1993 నాటి బ్రిటీష్ రైల్వే ప్రైవేటీకరణను ఆయన విమర్శించారు.


అమెరికా చరిత్రలో ఎన్నడూ లేనంత భారీ వినిమయ ప్యాకేజీని అక్కడి డెమోక్రాటిక్ ప్రభుత్వం అమలు చేస్తోంది. 4.7 లక్షల కోట్ల డాలర్ల (రూ. 352 లక్షల కోట్ల )లో 1.2 కోట్ల డాలర్లు (రూ. 90 లక్షల కోట్లు) రోడ్లు, వంతెనలు, నీటి మౌలిక సౌకర్యాలు, విద్యుత్తు రంగం తదితర మౌలిక రంగాల నిర్మాణానికి ఉపయోగిస్తోంది. ఇది అక్కడి పార్లమెంట్ ఆమోదం పొందింది. 2021 ఆగస్టు 10న మరో 3.5 లక్షల కోట్ల డాలర్లు (రూ. 265 లక్షల కోట్లు) ఆరోగ్య సౌకర్యాల విస్తరణకు, వాతావరణ ఉపద్రవాలను ఎదుర్కొనేందుకు కూడా సెనేట్ ఆమోదం పొందింది.

ఇతర దేశాలలో నగదీకరణ అనుభవాలను ఆండీ ముఖర్జీ బిజినెస్ స్టాండర్డ్ పత్రికలో వివరించారు. సింగపూర్‌లో సబర్బన్ రైళ్లను, సిగలింగ్ వ్యవస్థను తిరిగి జాతీయం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. అక్కడి ప్రైవేట్ పెట్టుబడిదారులు వాటి నిర్వహణా వ్యయాన్ని బాగా తగ్గించారు. దాంతో రైళ్ళు సజావుగా నడవటం ఆగిపోయింది. ప్రయాణీకులు కోపోద్రిక్తులయ్యారు.ఆస్ట్రేలియా లోని న్యూ సౌత్‌వేల్స్ రాష్ట్రంలో విద్యుత్తు స్తంభాలను, వైర్లను ప్రైవేటీకరించారు. ఐదు సంవత్సరాల్లో విద్యుత్తు చార్జీలు రెట్టింపయ్యాయి. ప్రభుత్వం ముందుకు వచ్చి వినిమయదారులపై భారాన్ని తగ్గించేందుకు ప్యాకేజీని ప్రకటించింది. మన దేశ ప్రజలు ఇప్పటికే విద్యుత్తు భారాలతో సతమతమవుతున్నారు. ఇంకా కార్పొరేట్ కంపెనీల పట్ల మోడీ ప్రభుత్వ ఔదార్యాన్ని భరించే స్థితిలో లేరు.2013లో ఆస్ట్రేలియాలో సిడ్నీ నగరానికి దగ్గరలోని రెండు ఓడరేవులను లీజుకు ఇచ్చారు. కానీ, ఇటీవల వినిమయదారుల కమిషన్ చైర్మన్, ప్రైవేటీకరణ – సామర్థ్యం పెరగటానికి దారితీయకపోతే మళ్ళీ తిరిగి లీజుకి ఇవ్వటం, ప్రైవేటీకరణ చేయటం మానుకోవాలన్నారు. కానీ మన దేశంలో సామర్థ్యం అనేది ప్రశ్నకాదు. ఉన్నదల్లా జాతీయ ఆస్తులను కొల్లగొట్టటమే.ఇక...'మేక్ ఇన్ ఇండియా' అభాసుపాలయింది. పెద్దనోట్ల రద్దు విపత్తును సృష్టించింది. జీఎస్టీ క్లిష్టంగా తయారైంది. 'ఆత్మనిర్భర్ భారత్' నకిలీ నినాదమని తేలింది. ఆస్తుల నగదీకరణ కూడా తప్పుడు పద్ధతులకు అంకురార్పణ కాబోతోంది. క్లుప్తంగా చెప్పాలంటే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం తీవ్రమవుతుంది. ప్రజల సంపదను ఆశ్రితులు దోచుకుంటారు. ప్రజా సమూహాలు నిష్ట దారిద్ర్యంలోకి నెట్టబడతారు. తమ సాధికారతను కోల్పోతారు.అభివృద్ధి ప్రక్రియలో ప్రజలకే ప్రాధాన్యత ఉండే విధంగా సామాజిక అభివృద్ధి జరగాలని 2018 జులైలో ప్రపంచ బ్యాంకు చెప్పింది. సామాజిక అభివృద్ధికి అర్థం ప్రజల మీద పెట్టుబడి పెరగాలి. ఇందుకు ప్రజల మీద ఆటంకాలు తొలగించాలి. అపుడు మాత్రమే వారు విశ్వాసంతో, ఆత్మగౌరవంతో తమ కలల సాకారం వైపు ప్రయాణిస్తారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా పని చేస్తోంది. ఈ విధానాలలో ఉపద్రవాలు వెదజల్లబడి ఉన్నాయి.

## పేదరికాన్ని పారద్రోలడానికి 34 సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నారు: స్పీకర్ తమ్మినేని సీతారాం



విశాఖపట్నం /శ్రీకాకుళం,అక్టోబర్ 22, (ప్రజాపాలన బ్యూరో ). ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదరికాన్ని పారద్రోలడానికి 34 సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని స్పీకర్ తమ్మినేని అన్నారు వైయస్సార్ ఆసరా రెండో విడత సంబరాలు ఈ కార్యక్రమంలో భాగంగా సరుబుజ్జిలి మండలం రొట్ట వలస గ్రామం లో నిర్వహించారు ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పాల్గొన్నారు అధికంగా పాల్గొన్న మహిళా సంఘాలు ముందుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు సరుబుజ్జిలి మండలం లో 611 సంఘాలకు 4 కోట్ల 50 లక్షల రూపాయల నమూనా చెక్కును డ్వాక్రా చెల్లెమ్మలకు స్పీకర్ చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా రాజకీయ జీవితంలో అనేకమంది ముఖ్యమంత్రులను చూశాను ఇలాంటి ముఖ్యమంత్రిని ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇంత పరిణితి చెందిన ముఖ్యమంత్రి చూడలేదని కొనియాడారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అడుగుజాడల్లో ప్రామాణికం కలిగిన పాలన అందిస్తున్నారని పార్టీలకతీతంగా అర్హత ప్రామాణికంగా పాలన సాగిస్తున్నారన్నారు పిల్లలను బడికి పంపిస్తే ఆ పిల్లలకి ఉన్నత చదువులు చదివిస్తానని



చెప్పి విద్య కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు తన సుదీర్ఘ పాదయాత్రలో డ్వాక్రా అక్కాచెల్లెళ్లకు రుణ మాఫీ చేస్తాం అని హామీ ఇచ్చి ఆ హామీ ప్రకారం రెండో విడత డ్వాక్రా అక్క చెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేశారు అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె వి జి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ శివానందమూర్తి (బాబు) జెడ్ పి టి సి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులుబెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు శేఖర్ స్థానిక సర్పంచ్ రమణ,అధికారులు పాల్గొన్నారు

# బడుగు జన బాంధవుడు ఎస్ ఆర్ శంకరన్: ఆంధ్ర బహుజన ప్రజావేదిక



అనంతపురం అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: కదిరిలో "ఆంధ్ర బహుజన ప్రజావేదిక" ఆధ్వర్యంలో ఎస్.ఆర్.శంకరన్ గారి 87వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల సమర్పించి నివాళి పలికారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు అంపావతిని గోవిందు మాట్లాడుతూ ఎస్.ఆర్.శంకరన్ బడుగుజన బంధావుడు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా శంకరన్ బాధ్యతలు నిర్వహించిన సందర్భంలో దళిత, ఆదివాసీల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధికి బాటలు వేసే అనేక కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు."ఒక్క ఏడాదిలోనే 120కి పైగా జీవోలు జారీ చేసిన ఘనత ఆయనది. హరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖను సాంఘిక సంక్షేమశాఖగా మార్చడానికి సంబంధించిన జీవో వాటిలో ఒకటి. సమీకృత ఆదివాసీ అభివృద్ధి సంస్థ (ఐటీడిఏ)లను ఏర్పాటు చేయడంలో, గిరిజన ఉప ప్రణాళికలను ప్రవేశపెట్టడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. 1984లో బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేసి వాటిని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు." ఆయన తన మొత్తం జీవితాన్ని అణగారిన వర్గాల ప్రజల బతుకుల్లో వెలుగులు నింపడానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి. జీవితమంతా నిజాయితీగా గడపటమే కాదు, తనకంటూ సొంత ఇల్లు కూడా ఏర్పరచుకోని నిరాడంబరి. ఐఏఎస్ అధికారులు సమాజంలోని అట్టడుగువర్గాల ప్రజలకు ఏ స్థాయిలో సేవ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చో ప్రత్యక్షంగా ఆచరించి చూపించిన మహనీయుడు. "రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పాలనా విభాగాలేవైనా సరే వారి ప్రథమ కర్తవ్యం అణగారిన వర్గాల సమస్యల పరిష్కారమే అని నమ్మి ఆచరించిన వ్యక్తి. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ వారి అభ్యున్నతి కోసం పాలనావ్యవస్థను పరుగులు పెట్టించిన ఘనత ఆయనకే దక్కుతుంది". శంకరన్ తమిళనాడులోని తంజావూరులో 1934 అక్టోబర్ 22న మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. 1956లో ఐఏఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన 1959లో కర్నూల్ జిల్లా నంద్యాల సబ్‌కలెక్టర్గా, తర్వాత నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. 1971%--%73 మధ్యకాలంలో కేంద్ర బొగ్గు, గనుల మంత్రిగా ఉన్న కుమారమంగళం వద్ద స్పెషల్ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసిన కాలంలో "బొగ్గు గనులను జాతీయం చేయటంలో అయన పాత్ర అత్యంత కీలకమైనది. బొగ్గు గని కార్మికులను బానిసలుగా చూస్తున్న స్థితిలో వారికి రాజ్యాంగపరమైన హక్కులను కల్పించడంలో ఆయన కృషి అభినందనీయం''. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక అంశాలలో రాణించటానికి తగిన విధానాలు రూపొందించారు. 1976లో వచ్చిన వెట్టిచాకిరీ నిషేధ చట్టం అయన కృషి ఫలితమే అని చెప్పవచ్చు. త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసినప్పుడు అక్కడ కేంద్ర పారామిలటరీ దళాల అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు తన శక్తి మేరకు ప్రయత్నం చేశారు. "భారత ప్రభుత్వం శంకరన్ సేవలను గుర్తించి 2005లో పద్మభూషణ్ అవార్డును ప్రకటించగా సున్నితంగా తిరస్కరించి తన నిరాడంబరతను చాటుకున్నారు." ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పని చేస్తున్నప్పుడు "ఆయనను బదిలీ చేయగా దానికి నిరసనగా ప్రజలు ఆందోళనకు దిగడం", వారికి ఆయనపై ఉన్న అచంచల విశ్వాసానికి, నమ్మకానికి నిదర్శనం. ఏ రోజూ ఆయన తన స్వంత పనులకు ప్రభుత్వ వాహనాన్ని వాడుకోలేదు. దానికి ఆయన వ్యతిరేకం. "నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నప్పుడు అక్కడి మహిళా కళాశాలలో సరియైన వసతులు లేవని తెలిసి కలెక్టర్ బంగ్లాను వాడుకోమని ఇచ్చిన ఘనత శంకరన్‌కే దక్కింది". బిళ్ళ బంట్రోత్ లేకపోతే ఆయనను కలెక్టర్‌గా గుర్తించడం కూడా కష్టమే. అంత సాధారణమైన జీవితాన్ని అయన గడిపేవారు. అందుకే పని చేసిన ప్రతి చోట ప్రజలు ఆయనను "ఐఏఎస్ గాంధీ" అని పిలిచేవారు. పదవీ విరమణ అనంతరం తనకు వచ్చిన పెన్షన్ కూడా పేద ఎస్సి, ఎస్టీ విద్యార్థుల చదువుల కోసం ఖర్చు పెట్టేవారు. పదవీ విరమణ అనంతరం, ప్రభుత్వానికి నక్సలైట్లకు మధ్య జరిగిన పోరులో ప్రాణాలు కోల్పోతున్న ప్రజల కోసం మానవతా దృక్పథంతో మేధావులతో కూడిన పౌర స్పందన వేదికను ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి, నక్సలైట్లకు మధ్య చర్చలు జరగడంలో ముఖ్యమైన భూమిక పోషించారు. 2004లో ప్రభుత్వంతో మాట్లాడి నక్సలైట్లను శాంతి చర్చలకు ఆహ్వానింపజేయడంలో అనుసంధానకర్తగా వ్యవహరించారు. దేశచరిత్రలోనే దీనిని ఒక అరుదైన సంఘటనగా అభివర్ణించవచ్చు. దళిత మానవహక్కుల కార్యకర్త బెజవాడ విల్సన్‌తో కలిసి "సఫాయి కర్మచారి అందోళన్" అనే సంస్థను స్థాపించి పాకీ పనివారి విముక్తి కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించి ప్రభుత్వం వారి సంక్షేమం మీద దృష్టి సారించేలా చేశారు. ఆ ఉద్యమం వల్ల ఎంతోమంది చేతితో మలం ఎత్తే అమానవీయ విధుల నుంచి విముక్తి పొందారు. 1985లో కారంచేడు ఘటన అనంతరం బాధితులకు పునరావాసం కల్పించడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. "ప్రజల ఐఏఎస్ అధికారి''గా, మహోన్నత మానవతావాదిగా చరిత్రలో నిలచిన శంకరన్ జీవితం నేటి తరం అధికారులకు, సామాజిక ఆర్థిక న్యాయం కోసం కట్టుబడి ఉన్నవారందరికీ స్ఫూర్తిదాయకం. ప్రజా సంక్షేమానికే పూర్తికాలం అంకితమైన ఆయన 2010 అక్టోబర్ 7న హైదరాబాద్‌లో మరణించారు. నిరుపేదల సేవే సిసలైన ప్రజాపాలన అని నిరూపించి కోట్లాది మంది దళిత ఆదివాసీ జీవితాల్లో వెలుగు నింపిన అసలు సిసలు నిజమైన ప్రజాసేవకుడు ఐఏఎస్ శంకరన్. అతనికి ఐఏఎస్ అనే అధికారం ఉన్నందువలనే తన మంచి మనస్సుతో ప్రజలకు అనేక సేవలు అందించాడు. కనుక ఇటువంటి మహనీయుల సేవలను, ఆశయాలను ఆదర్శంగా తీసుకొని బహుజనుల రాజ్యాధికారం సాధించుకొనుటకు ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలైన బహుజనులు అందరూ చైతన్యవంతులు కావాలని పిలుపునిస్తున్నామన్నారు. కదిరి నియోజకవర్గం కన్వీనర్ వై.ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.లక్ష్మన్న, జిల్లా కో–కన్వీనర్ కె.సాయిశీనా, కదిరి టౌన్ కమిటీ కో–కన్వీనర్లు చారువల్లి ఆంజనేయులు, కదిరి నియోజకవర్గం కో–కన్వీనర్ జయపాల్ నాయుడు,కదిరి టౌన్ మాజీ కన్వీనర్ వెంకటేశ్వరగౌడ్, నిజామోద్దీన్, కుటాగుళ్ల రామన్న, సి.వెంకటరమణ, శ్రీనివాసులు, రామచంద్ర, రిటైర్డ్ ఉద్యోగి చంద్రశేఖర్, బొట్టు చంద్ర, పులగంపల్లి రాము, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి రామచంద్ర, మోటుకుపల్లి రమణ, కుల్లాయప్ప, ఆర్.టి.సి. ఉద్యోగి నరసింహులు, రాంకిశోర్, హిదయతుల్లా, శంకరప్ప, తిరుపాలు తదితరులు ఆపాల్గొన్నవారు

## చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం





పొన్నూరు, అక్టోబర్ 22ప్రజా పాలన ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి టిడిపి నేత పట్టాభి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, చంద్రబాబు నాయుడు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గత రెండు రోజులుగా పొన్నూరు పట్టణంలో జరుగుతున్న జనాగ్రహ దీక్షలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. చివరి రోజు ఐలాండ్ సెంటర్ లో ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను వైకాపా నాయకులు దగ్ధం చేశారు. చంద్రబాబు దిష్టిబొమ్మ కు తొలుత చెప్పులు దండలు వేసి ప్రదర్శించారు. దిష్టిబొమ్మను చెప్పులుతో కొట్టుకుంటూ అంబేద్కర్ సెంటర్ కు వచ్చారు. అక్కడ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నినాదాలు చేశారు. అంతకుముందు ఐ లాండ్ సెంటర్ లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు జనాగ్రహ దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో కోటా శ్రీనివాసరావు, ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ నాజర్,కొల్లేరు శ్రీనివాసరావు, బోయిన శివనాగరాజు, గెరా కుమారి,బొద్దులూరి రంగారావు, గెరా సంజీవ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో జనాగ్రహ దీక్ష



ఏలూరు, అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: టిడిపి అధినేత చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దెందులూరు ఎంఎల్ఏ కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం దెందులూరు మండలం గోపన్నపాలెంలోని గ్రామ సచివాలయ ఆవరణలో జనాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకులు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలోని శాంతిసామరస్యతకు విఘాతం కలిగేవిధంగా కులాలు, మతాల మధ్య వైషమ్యాలు కలిగేవిధంగా వ్యవహరించడం పార్టీపై అసత్యప్రచారం చేయడం పట్ల తీవ్రంగా ఖండించారు. టిడిపి నాయకులు వైసిపి నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదంటూ తీవ్రంగా హెచ్చరించారు. వైసిపి పార్టీ ఎదుగుదలను ఓర్చలేక ప్రజల్లో అనుమానాలు కలిగించాలనే ఉద్దేశ్యంతో చంద్రబాబు కుట్రపన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి , వైసిపినాయకులు, ప్రజా ప్రతినిధులు జడ్పీటీసీలు ఎంపీటీసీలు ఎంపీపీలు అధ్యక్షులు కార్యకర్తలు, మహిళా సర్పంచులు సర్పంచ్లు, వార్డు మెంబర్లు, అక్కా చెల్లెమ్మలు తదతరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామంలోని పరిసరాల పరిశుభ్రత నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి: సర్పంచ్ హైమావతి



గోనెగండ్ల అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రమైన గోనెగండ్ల మేజర్ గ్రామ పంచాయితీకి జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద చెత్త సేకరణ వాహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని సర్పంచ్ పూజారి హైమావతి తెలిపారు. గ్రామం లోని పరిసరాల పరిశుభ్రత, నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆమె పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టి. ప్రభాకర్ నాయుడు పాల్గొని గ్రామ ప్రజలంతా సహకరించి పారిశుధ్య నిర్ములనకు కృషిచేయాలని తెలిపారు.అనంతరం అడ్వకేట్ పూజారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి మహిళ తన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామపంచాయతీనీ పారిశుధ్య రహిత, కాలుష్య రహిత గ్రామంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, గ్రామము లోని తడిచెత్తాను,పొడిచెత్తనీ వేరుచేసి ప్రతిరోజు ఉదయం చెత్తసేకరణ వాహనంలో వేయాలని తెలిపారు. అందుకు గ్రామప్రజలు,ప్రజాప్రతినిధులు పూర్తిగా సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతి జూనియర్ అసిస్టెంట్ సతీష్,టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య నాయుడు, అడ్వకేట్ పోలకల్ వెంకటేశ్వర్లు, నూరమ్మద్, మదీన, తెలుగు యువత నాయకులు ఎన్ వి బాబు నాయుడు,పంచాయతీ సిబ్బంది,పొదుపు గ్రూపు సభ్యులు, స్వచ్ఛభారత్ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు దీక్షకు పొత్తూరి, కొవ్వలి సంఘీభావం



నరసాపురం, అక్టోబర్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) : ఇటీవల కాలంలో తెదేపా కార్యాలయాలు, నాయకులపై జరుగుతున్న వరుస దాడులకు నిరసనగా తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నుంచి చేపట్టిన 36 గంటల నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపేందుకు శుక్రవారం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ షరీఫ్ నేతృత్వంలో తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, తెదేపా సీనియర్ నేత కొవ్వలి రామ్మోహన్ నాయుడు (ఎన్ఆర్ఐ) ల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నరసాపురం నుండి మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి 20 కార్లతో ర్యాలీగా తరలివెళ్లారు. పొత్తూరి రామరాజు, రామ్మోహన్ నాయుడు, మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ పసుపులేటి రత్నమాలలు దీక్షలో కూర్చున్న చంద్రబాబుకు సంఘీభావం తెలియజేశారు. ప్రజాసమస్యలు, ప్రభుత్వ అవినీతి కార్యక్రమాలపై మాట్లాడిన తెదేపా నేతల ఇండ్లు, కార్యాలయాలపై వైసిపి మూకల దాడులను వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కొవ్వలి రామ్మోహన్ నాయుడు 2 వేల నోట్లతో అలంకరించిన రూ 2 లక్షల రూపాయల దండను పార్టీ ఫండ్ గా చంద్రబాబుకు అందజేశారు. వైసీపీ నేతల దాడుల్లో ధ్వంసమైన తెదేపా కార్యాలయాల మరమ్మతు పనులకు ఈ నిధులను వినియోగించాలని చంద్రబాబును కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పాలకొల్లు శాసనసభ్యుడు నిమ్మల రామానాయుడులు పాల్గొన్నారు.

## రాజకీయ ఉనికి కోసమే చంద్రబాబు దీక్ష



నరసాపురం, అక్టోబర్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) : రాజకీయ ఉనికి కోసమే చంద్రబాబునాయుడు ఆరాట పడుతున్నారని జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన రెడ్డిపై టీడీపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2 వ రోజు శుక్రవారం "జనాగ్రహదీక్ష" కు జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ సంఘీభావం తెలియజేసి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలని అన్నారు. ముఖ్యమంత్రిని దుర్భాషలాడించి తిరిగి దీక్షచేయడం సిగ్గుచేటని విమర్శించారు. చంద్రబాబు నాయుడు కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను రెచ్చగొడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తక్షణమే ముఖ్యమంత్రి జగన్ కు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు తీరు నచ్చక రాష్ట్రమంతా "జనాగ్రహదీక్షలు"చేస్తుంటే కల్లబొల్లి మాటలతో మాయచేస్తున్నారని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. బంద్ విఫలం కావడంతో దీక్ష పేరుతో డ్రామాలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. చంద్రబాబు దుర్మార్గాలు చూసి రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ప్రవర్తించాలని జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల , ఏఎంసి చైర్మన్ కొల్లా బత్తుల రవికుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంపీపీలు నల్లి జయలక్ష్మి జె.వి.ఆర్, అందె భుజంగరావు, జడ్పిటిసిలు బొక్క రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి , పట్టణ అధ్యక్షులు భూసారపు జయప్రకాష్, మొగల్తూరు మండల పార్టీ అధ్యక్షులు కర్రి ఏసుబాబు, వై కె ఎస్, దొండపాటి స్వాములు, కావలి నాని, తిరుమాని నాగరాజు, మెర్లిన్, కౌన్సిలర్లు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జడ్పిటిసి మండల సరస్వతి కొండలరావు జన్మదిన వేడుకలు






ఏలూరు అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: దెందులూరు శాసనసభ్యులు కొఠారి అబ్బయ్య చౌదరి ఆశీస్సులతో ఏలూరు మండలం జడ్పిటిసి గా మొట్టమొదటి సారిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన ఏలూరు మండల జడ్పిటిసి మండల సరస్వతి కొండలరావు ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న జడ్పిటిసి సరస్వతి కొండలరావు దెందులూరు శాసనసభ్యులు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు దెందులూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు నాయకులు మండల సరస్వతి కొండల రావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మహిళా సర్పంచులు సర్పంచులు ఎంపీటీసీలు జడ్పీటీసీలు నాయకులు అభిమానులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైద్యులు సేవాదృక్పదంతో వైద్యం చేయాలి





ఏలూరు అక్టోబరు 22 ప్రజాపాలన ప్రతినిధి: ఏలూరు దుగ్గిరాల డెంటల్ కాలేజీ వైద్యులు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో వైద్యం చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో 15వ ఏడాది దంతవైద్య విద్యార్థులకు గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో డిగ్రీ పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ప్రజలకు అందించే వైద్యం విషయంలో పాటించాల్సిన విధి, విధానాలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యం అందించే విధానంపై నూతన వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే రోగులపట్ల సేవాభావాన్ని ప్రదర్శించాలన్నారు. రోగులతో నవ్వుతూ మాట్లాడితే.సగం వ్యాధి నయమైనట్లేనని ఆయన పేర్కొన్నారు. రోగికి వైద్యునివల్ల ముందుగా నమ్మకం అనేది ఏర్పడాలని, అలాంటి వైద్యులను ప్రజలు గౌరవిస్తారని ఆయన చెప్పారు. చేసే పనిలో సేవ ఉండాలే తప్ప, సొమ్ముకోసమే వైద్యం అనే విషయాన్ని దరిదాపులోకి కూడా తీసుకురావద్దని ఆయన సూచించారు. దంతవైద్యులు ఎక్కువమంది దేశ అత్యున్నత సివిల్ సర్వీసెస్ కు ఎంపికవుతున్నారని, ఇది దంతవైద్యులు గర్వించాల్సిన విషయమని ఆయన తెలిపారు. సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల దేశంలోఅత్యుత్తమ కళాశాలగా ఎదిగిందని ఆయన కితాబు నిచ్చారు. క్రమశిక్షణ, సేవాభావం కళాశాల ఎదుగుదలకు కారణమని ఆయనకళాశాల చైర్మన్ ఒస్ జయరావు, కరస్పాండెంట్ పాదర్ మోజెస్ల సేవలను కొనియాడారు. ముందుగా 2016 ఏడాది బీడీఎస్,%వఖు% ఎండీఎస్ విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డెంటల్ కాన్సిల్ సభ్యులు డాక్టర్ మెహబూబ్ షేక్, ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు,కళాశాల కరస్పాండెంట్ పాదర్ జి.మోజెస్, వికార్ జనరల్ ఫాదర్ డాక్టర్ ఎ.బాల,చాన్సలర్ ఫాదర్ బాబూ జార్జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గ్లవరాలు ఏదో పాదర్ ఫెలిక్స్, పాదర్ . జాకబ్, ఫాదర్ మైఖేల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు .



# పూజాని గోల్డెన్ లెగ్ గా ఫిక్స్ చేశారు



అదృష్ణం కలిసొస్తే అన్నీ వెంట నడిచొస్తాయి. ప్రతిభతో పాటు లక్ కలిసొస్తే రంగుల ప్రపంచంలో దూసుకెళ్లొచ్చు. ప్రస్తుతం కెరీర్ పరంగా అలాంటి సక్సెస్ ఫుల్ ఫేజ్ ని ఎంజాయ్ చేస్తోంది బుట్టబొమ్మ పూజా హెగ్డే. టాలీవుడ్ లో కెరీర్ ప్రారంభించిన నాలుగైదేళ్లకు ఈ బ్యూటీ క్రేజు అమాంతం పదింతలైంది. జీవా హీరోగా మిస్కిన్ రూపొందించిన తమిళ చిత్రం ముగాముడితో నటిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన పూజా హెగ్డే ఆ తరువాత ఒక లైలా కోసం చిత్రంతో తెలుగులో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. తొలి చిత్రం అంతగా ఆకట్టుకోలేకపోయినా పూజకు మాత్రం వరుస ఆఫర్లని తెచ్చిపెట్టింది. ముకుంద.. దువ్వాడ జగన్నాథం చిత్రాలతో పూజా టాలీవుడ్ లో పాగా వేసింది. ఆ తరువాత చేసిన చిత్రాలు సాక్ష్యం.. అరవింద సమేత.. మహర్షి.. గద్దలకొండ గణేష్.. అల వైకుంఠపురములో .. ఇలా వరుసగా విజయాలు సాధించడం.. బన్నీతో కలిసి చేసిన అల వైకుంఠపురములో ఇండస్ట్రీ హిట్ గా నిలవడంతో పూజ టాలీవుడ్ కు మోస్ట్ క్రేజీ హీరోయిన్ గా దర్శకుల పాలిట బుట్టబొమ్మగా మారిపోయింది. సక్సెస్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్న అక్కినేని అఖిల్ నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ కూడా సక్సెస్ కావడంతో పూజని గోల్డెన్ లెగ్ గా అభివర్ణిస్తున్నారు. ఇప్పట్లో అఖిల్ కు హిట్ వస్తుందా అనే అనేమానాల్ని వ్యక్తం చేసిన టాలీవుడ్ వర్గాలు పూజా కారణంగానే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ సక్సెస్ అయిందని కథనాలు అల్లేస్తుండడం ఆసక్తికరం. దీంతో పూజ క్రేజ్ మరింతగా పెరిగిపోయింది. ఇదిలా వుంటే ఈ మూవీ సక్సెస్ ని ఎంజాయ్ చేస్తున్న పూజా హెగ్డే మళ్లీ హీటు పెంచేసింది. ఈ మూవీ సక్సెస్ ఆనందంలో ప్రత్యేకంగా ఫొటోషూట్లతో విరుచుకుపడుతోంది. బ్లాక్ బికినీ ధరించి ఇదిగో ఇలా థై షోస్ చేస్తూ వయ్యారంగా ఫొటోలకు ఫోజులిచ్చింది. బికినీపై లాంగ్ కోట్ తో కవర్ చేసినా పూజా అందాలు దాగడం లేదు. పూజా ఫొటోలు ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తున్నాయి. పూజ తమిళ క్రేజీ హీరో ఇలయదళపతి విజయ్ నటిస్తున్న బీస్ట్ లో చేస్తున్న విషయం తెలిసిందే. తెలుగులో పూజ నటించిన రాధేశ్యామ్- ఆచార్య చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.

# గామి టీజర్ పై బన్ని ప్రశంసలు



విజయ్ దేవరకొండ సహా పలువురు ప్రతిభావంతులైన స్టార్లను అల్లు అర్జున్ ప్రమోట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో ప్రతిభావంతుడు విశ్వక్ సేన్ కి బన్ని నుంచి సపోర్ట్ దక్కుతోంది. యువ నటులు విశ్వక్ సేన్ - చాందిని చౌదరి జంటగా నటించిన గామి ప్రకటన టీజర్ ఇటీవలే విడుదలైంది. ఈ టీజర్ పై ప్రేక్షకుల నుంచి ప్రశంసలు కురుస్తున్నాయి. తాజాగా స్టార్ హీరో అల్లు అర్జున్ ట్విట్టర్ వేదికగా టీజర్ సహా చిత్ర బృందంపై ప్రశంసలు కురిపించారు. గామి టైటిల్ ప్రకటన ఆసక్తిని రేకెత్తించిందని.. మొత్తం బృందాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని బన్ని అన్నారు. టీమ్ లో చాలా మంది యువకులు ఫ్రెష్ లుక్ తో ఉన్నారు. ఇండస్ట్రీలో నవతరం నిర్మాతలు పెరగడం చూసి నిజంగా చాలా సంతోషంగా ఫీలయ్యాను. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని అందించాలనే వారి అభిరుచిని.. క్రియేషన్స్ ప్రయత్నాన్ని అభినందిస్తున్నాను అని ట్వీట్ చేశారు. కొత్త కుర్రాడు విద్యాధర్ కాగిత ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు కార్తీక్ శబరీష్ నిర్మిస్తున్నారు. యువి క్రియేషన్స్ విభాగం ఈ చిత్రాన్ని సమర్పణలో వి- సెల్యూలాయిడ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. హిట్ తర్వాత మరో చక్కని విజయం కోసం వేచి చూస్తున్న విశ్వక్ కి గామి రూపంలో మరో హిట్టు దక్కనుందేమో చూడాలి. బన్ని ప్రమోషన్ ఈ మూవీకి పెద్ద ప్లస్ కానుంది.

### ఇందుకేనా చితక్కొట్టుడు ..

# బ్యూటీకి సలాం గులాం



నేటితరం నాయికగా దూసుకెళుతోంది తమిళ సోయగం నిక్కీ తంబోలీ. చీకటి గదిలో చితక్కొట్టుడు అనే కాన్సెప్ట్ బేస్డ్ మూవీతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. తొలి ప్రయత్నమే హీట్ పెంచే కంటెంట్ తో విరుచుకుపడింది నిక్కీ. ఆ తరువాత చేసిన తిప్పరా మీసం పెద్దగా ఆకట్టుకోలేదు కానీ లారెన్స్ మాస్టార్ తో కాంచన 3లో నటించి ఆకట్టుకుంది. దీంతో తెలుగులో తన సత్తా చాటాలనుకున్న నిక్కీకి చేదు అనుభవమే ఎదురైంది. సౌత్ లో క్రేజీ హీరోయిన్ గా ఓ వెలుగు వెలగాలనుకున్న ఆమె ఆశలు ఆవిరైపోయాయి. దీంతో బిగ్ బాస్ సీజన్ 14లోకి ఎంట్రీ ఇచ్చేసింది. అయితే మధ్యలోనే బయటికి వచ్చేసింది. అందులో తనదైన స్టైల్లో ఓ కంటెస్టెంట్ తో రొమాన్స్ ని రక్తికట్టించి వార్తల్లో నిలిచిన నిక్కి మొత్తానికి క్రేజీ భామగా పాపులారిటీని సొంతం చేసుకుంది. ఖత్రోంకీ ఖిలాడీ షోలో పాల్గొంటున్న నిక్కీ నిత్యం హాట్ హాట్ ఫొటో షూట్ లతో సోషల్ మీడియాని మాత్రం ఊపేస్తోంది. తాజాగా నియాన్ గ్రీన్ డిజైనర్ టాప్ లో అందాలని పరిచేస్తూ ఫొటోలకు ఫోజులిచ్చింది నిక్కి. దీనికి సంబంధించిన ఫొటోలని సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంది. ఇప్పుడీ ఫొటోలు ఇన్ స్టాని హీటెక్కిస్తున్నాయి. హీరోయిన్ గా నిక్కీ అందాలు..నటనకు ఇప్పటికే మంచి మార్కులు వేసింది యూత్. కుర్రకారుని పరవశింపజేసే పరువాలు వున్నా నిక్కీకి రవ్వంత అదృష్టం యాడైతే పెద్ద స్టార్ అయ్యేది అన్న పాజిటివ్ ఫీడ్ బ్యాక్ ఉంది. ఇక హిందీ బిగ్ బాస్ లో నిక్కీ ఎంటర్ టైన్ చేసిన తీరుకు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. పూజా హెగ్డే అంత స్టార్ డమ్ చిక్కకపోయినా నిక్కీ తనకంటూ ఒక రేంజును ఆస్వాధించేందుకు ఆస్కారం లేకపోలేదని విశ్లేషిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ సినిమాకి భారీ ఓటీటీ ఆఫర్..?



పవన్ కళ్యాణ్ - రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం "భీమ్లా నాయక్". మలయాళ సూపర్ హిట్ 'అయ్యప్పనుమ్ కోషియం' చిత్రానికి ఇది తెలుగు రీమేక్. ఇందులో పవన్ సరసన నిత్యా మీనన్.. రానా కు జోడీగా సంయుక్త మీనన్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాలోని క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రీమేక్ ప్రాజెక్ట్ అయినప్పటికీ పవన్ ఇమేజ్ కారణంగా సినిమాపై భారీ హైప్ ఏర్పడింది. 'భీమ్లా నాయక్' చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2022 జనవరి 12న విడుదల చేయాలనుకుంటున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ - ఇద్దరు హీరోల ఇంట్రో టీజర్లు - ఎస్ ఎస్ థమన్ స్వరపరిచిన రెండు పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అందుకే ఈ సినిమా డిజిటల్ రైట్స్ కు మంచి డిమాండ్ ఏర్పడింది. థియేట్రికల్ రిలీజ్ స్కిప్ చేసి ఈ చిత్రాన్ని డైరెక్ట్ ఓటీటీ విడుదలకు ఇస్తే అమెజాన్ ప్రైమ్ వీడియో సంస్థ భారీ ఆఫర్ ఇవ్వడానికి రెడీగా ఉందని టాక్ వినిపిస్తోంది. పవన్ కళ్యాణ్ - రానా కలసి నటిస్తున్న ఈ సినిమాని డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ చేయడానికి అమెజాన్ ప్రైమ్ వీడియో 150 కోట్లకు పైగా చెల్లించడానికి ముందుకు వచ్చిందంట. అమెజాన్ వారు 'వకీల్ సాబ్' మూవీ రైట్స్ కు చెల్లించిన దాంతో పోల్చుకుంటే ఇది చాలా ఎక్కువే అని చెప్పాలి. కాకపోతే పవన్ సినిమా క్లిక్ అయితే బాక్సాఫీస్ వద్ద ఈజీగా వంద కోట్ల షేర్ వసూలు చేస్తుంది. ఓటీటీ స్ట్రీమింగ్ హక్కులు ఎలాగూ అర కోటికి అమ్ముడు పోయే అవకాశం ఉంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'భీమ్లా నాయక్' సినిమా బాగుంటే మాత్రం అన్నీ కలుపుకుని నిర్మాతలు లాభాల్లోకి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి డైరెక్ట్ విడుదల కోసం ఓటీటీ వారిచ్చే బంఫర్ ఆఫర్ కు మేకర్స్ ముగ్గు చూపకపోవచ్చు. ఇది వరకే పవన్ సినిమాని నేరుగా డిజిటల్ రిలీజ్ చేస్తున్నారని వచ్చిన వార్తలకు ఫుల్ స్టాప్ పెడుతూ 'సంక్రాంతి రిలీజ్' అని క్లారిటీ ఇచ్చారు. విడుదలకు ఇంకా చాలా టైం ఉంది. మరి ఈ గ్యాప్ లో ఓటీటీ డీల్ గురించి ఏమైనా ఆలోచిస్తారేమో చూడాలి. కాగా 'భీమ్లా నాయక్' చిత్రాన్ని పీడీవీ ప్రసాద్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సాగర్ కె చంద్ర ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. త్రివిక్రమ్ శ్రీనివాస్ దీనికి స్క్రీన్ ప్లే - మాటలు అందిస్తున్నారు. రవి కె చంద్రన్ సినిమాటోగ్రాఫర్ గా.. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# ఐపీఎల్పై కన్నేసిన బాలీవుడ్ జంట



ఐపీఎల్ రెండు కొత్త జట్లను కొనేందుకు భారతదేశంతో పాటు విదేశాలలో కూడా చాలా ఆసక్తి ఉంది. ప్రపంచంలోని బలమైన ఫుట్బాల్ జట్టు మాంచెస్టర్ యునైటెడ్ యజమాన్యం కూడా కొత్త ఐపీఎల్ జట్లపై ఆసక్తి చూపుతున్నారంట. ఈ జట్టు యాజమాన్యం గ్లేజర్ కుటుంబానికి చెందినది. మాంచెస్టర్ యునైటెడ్ ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ ఖరీదైన ఫుట్బాల్ క్లబ్లలో ఒకటి. ప్రపంచవ్యాప్తంగా ఈ క్లబ్కు అభిమానులు ఉన్నారు. క్రిస్టియానో రొనాల్డో ప్రస్తుతం ఈ జట్టు కోసం ఆడుతున్నాడు. ఈ జట్టు ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ ఆఫ్ ఇంగ్లండ్లో భాగంగా ఉంది. చాలా మంది భారత క్రికెటర్లు కూడా మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్ కు అభిమానులు. ఇటీవల జస్ప్రీత్ బుమ్రా ఈ క్లబ్ స్టేడియాన్ని సందర్శించారు. అతను క్లబ్ నుంచి బహుమతిగా జెర్సీని కూడా పొందాడు. ఐపీఎల్ టీంను కొనడానికి గ్లేజర్ కుటుంబం టెండర్ పత్రాలు కొనుగోలు చేసిందని టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొంది. దీన్ని ఒక ప్రైవేట్ ఈక్విటీ కంపెనీ ద్వారా బిడ్ దాఖలు చేస్తున్నట్లు పేర్కొంది. ఐపీఎల్ టీంపై కంపెనీ చాలా హొప్స్ పెట్టుకుందంట. కొత్త జట్ల టెండర్లు సంబంధించిన చివరి తేదీని బీసీసీఐ అక్టోబర్ 20గా నిర్ణయించింది. అయితే నిన్నటితో ఆ తేదీ ముగిసింది. కానీ బీసీసీఐ ఈ చివరి తేదీని పొడిగించినట్లు తెలుస్తోంది. అది కూడా కేవలం మాంచెస్టర్ యునైటెడ్ కోసం పొడిగించినట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మాంచెస్టర్ యునైటెడ్ ఐపీఎల్ జట్టును కొనుగోలె చేస్తే.. ఐపీఎల్ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుందని బీసీసీఐ ప్లాన్ చేస్తుంది. అలాగే బీసీసీకి మరింత డబ్బు వచ్చి చేరనుంది. బీసీసీఐ జారీ చేసిన నిబంధనలలో విదేశీ కంపెనీలు కూడా జట్టును కొనుగోలు చేయడానికి అనుమతి ఇచ్చారు. వారు బిడ్ గెలిస్తే వారు భారతదేశంలో కంపెనీని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. మాంచెస్టర్ యునైటెడ్ యజమాన్యం బిడ్కు సంబంధించిన పత్రాలను కొనుగోలు చేసినట్లు నివేదిక పేర్కొంది. కొత్త జట్లను సొంతం చేసుకునే రేసులో అదానీ గ్రూప్ టోరెంట్ ఫార్మా అరబిందో ఫార్మా ఆర్పి-సంజీవ్ గోయెంకా గ్రూప్ హిందుస్థాన్ టైమ్స్ మీడియా జిందాల్ స్టీల్ రోనీ స్క్రూవాలా ముగ్గురు ప్రైవేట్ ఈక్విటీ ప్లేయర్లు ఉన్నారు. వీరితో పాటుగా రణవీర్ దీపికా పదుకొనె కూడా ఉన్నారు. ఒక పెద్ద కార్పొరేట్ కంపెనీ మద్దతుతో కొత్త జట్టును కొనుగోలు చేయనున్నారు. అహ్మదాబాద్ లక్నో గౌహతి కటక్ ఇండోర్ ధర్మశాల వంటి నగరాలు కొత్త జట్ల హొస్ట్ లుగా ముందంజలో ఉన్నాయి. వీటిలో ఏవైనా రెండు నగరాలు మాత్రమే ఫ్రాంచైజీలుగా ఎంపిక కానున్నాయి. అనగా ఏదైనా రెండు నగరాల్లో మాత్రమే కొత్త జట్లు ఉంటాయి. వాటిలో అహ్మదాబాద్ పేరు ముందు వరుసలో ఉంది. ఇటీవల నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం కారణంగా ఇక్కడ చాలా ఆసక్తి కనబడుతోంది. అలాగే అహ్మదాబాద్ చాలా కాలంగా కొత్త జట్టు కోసం రేసులో ఉంది.

# కన్నడ హీరోని తెలుగులో చూస్తారా..?




'కేజీయఫ్' సినిమా తెలుగులో సంచలన విజయం సాధించిన తర్వాత కన్నడ హీరోలందరూ తమ చిత్రాలను డబ్బింగ్ చేసి విడుదల చేస్తున్నారు. కాకపోతే ఆ సినిమా స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి. అయితే ఇప్పుడు కన్నడ సూపర్ స్టార్ కిచ్చా సుదీప్ ''K 3 కోటికొక్కడు'' సినిమాతో తెలుగు మార్కెట్ ని టార్గెట్ చేస్తున్నారు. టాలీవుడ్ ప్రేక్షకులకు కిచ్చా సుదీప్ సుపరిచితమే. ఎన్నో తెలుగు సినిమాల్లో విభిన్న పాత్రల్లో కనిపించి అలరించారు. కానీ హీరోగా పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. ఇప్పుడు హీరోగా ''%ఖ%3 కోటికొక్కడు'' అనే మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ తో పలకరించబోతున్నారు. శివ కార్తీక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. కన్నడలో 'కోటిగోబ్బ 3' పేరుతో ఇటీవలే విడుదలైన ఈ చిత్రం నాలుగు రోజుల్లోనే దాదాపు 40 కోట్లు వసూలు చేసినట్లు శాండిల్ వుడ్ ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇది సుదీప్ కెరీర్ లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలవబోతోందని తెలుస్తోంది. ఇప్పుడు తెలుగులో కూడా అదే స్థాయి సక్సెస్ అందుకుంటుందని మేకర్స్ భావిస్తున్నారు. స్పందన పాసం - శ్వేతన్ రెడ్డి సమర్పణలో గుడ్ సినిమా గ్రూప్ "K3 కోటికొక్కడు" సినిమాని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. శ్రేయాస్ శ్రీనివాస్ - దేవేందర్ డీకే నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే డబ్బింగ్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని నవంబర్ 12న థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. లేటెస్టుగా రిలీజ్ చేసిన ట్రైలర్ ఆకట్టుకుంది. తెలుగులో వారానికి రెండు క్రేజీ మూవీస్ విడుదల అవుతున్న తరుణంలో ఈ కన్నడ సినిమా ఎలాంటి ప్రేక్షకాదరణ దక్కించుకుంటుందో చూడాలి. కాగా 'K3 కోటికొక్కడు' సినిమాలో సుధీర్ రెండు విభిన్న పాత్రల్లో కనిపిస్తున్నారు. మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్ గా నటంచిన ఈ చిత్రంలో శ్రద్ధాదాస్ కీలక పాత్రలో కనిపించనుంది. అబ్బాబ్ - రవి శంకర్ - అభిరామి - నవాబ్ షా తదితరులు ఇతర పాత్రలు పోషించారు. అర్జున్ జన్య ఈ చిత్రానికి సంగీతం సమకూర్చగా.. శేఖర్ చంద్రు సినిమాటోగ్రఫీ అందించారు.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com